News Daily

ఎడిటర్ :

B. ఉపేందర్

cknews7484@gmail.com

Visit in :
www.cknewstv.in

CK
చంద్ర కాంత్

NEWS
తెలుగు దినపత్రిక

Website
cknewstv.in

సంపుటి : 05 | సంచిక :283 | ఖమ్మం | శనివారం, నవంబర్ 14, 2026 | CK NEWS | పేజీలు : 08

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad




## ప్రపంచ దేశాల చూపు బ్రహ్మోస్‌పైనే!

- ఫిలిప్పీన్స్, వియత్నాం బాటలో మరిన్ని దేశాలు..
- క్షిపణుల కొనుగోలుకు ఆసక్తి
- ఆపరేషన్ సిందూర్‌తో పెరిగిన అంతర్జాతీయ డిమాండ్..
- ప్రభుత్వ అనుమతుల కోసం ఎదురుచూపులు




# బీజేపీ, బీఆర్ఎస్‌ది ఒకే వైఖరి




- రాహుల్ హైదరాబాద్ పర్యటనను అడ్డుకుంటామనడం సరికాదు
- బీజేపీ, బీఆర్ఎస్ నేతలు విజ్ఞత ప్రదర్శించాలి..
- భారత్ సమ్మిట్‌తో తెలంగాణ ఖ్యాతి ప్రపంచానికి చాటుతాం
- రాహుల్ పర్యటనను స్వాగతించాలి
- 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం

హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర అనుకూలతలు, ఘనతలు, పెట్టుబడులకు ఉన్న అవకాశాలను ప్రపంచానికి పరిచయం చేయడమే లక్ష్యంగా భారత్ సమ్మిట్ నిర్వహిస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణం కల్పించడంతోపాటు స్పష్టమైన విధివిధానాలతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని వెల్లడించారు. భారత్ సమ్మిట్‌లో పాల్గొనేందుకు లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ హైదరాబాద్‌కు వస్తానంటే అడ్డుకుంటామని కొందరు వ్యాఖ్యానించడం సరికాదని అన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో సీఎం పలు అంశాలపై మాట్లాడారు. రాహుల్ గాంధీ హైదరాబాద్ పర్యటనపై బీజేపీ, బీఆర్ఎస్ నేతలు అభ్యంతరాలు వ్యక్తం చేయడాన్ని రేవంత్ రెడ్డి - మిగతా 3లో



## బంగాళాఖాతంలో మరో తుపాను ఏర్పడితే.. పేరు ఇదే.. 'అక్వాన్'!

- బంగాళాఖాతంలో ఈ నెల 18 నాటికి తుపాను ఏర్పడే అవకాశం
- తుపానుగా మారితే ఇరాన్ ప్రతిపాదించిన 'అక్వాన్' పేరు ఖరారు
- దక్షిణ అండమాన్ సముద్రంలో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం

# ఆటో కార్మికులకు ఇందిరమ్మ ఇళ్లు!

- హైదరాబాద్‌లో నాలుగు ప్రాంతాల్లో 2 వేల ఎల్ఐజీ ఫ్లాట్ల నిర్మాణం
- రూ.220 కోట్లతో ఆటోనగర్ కాలనీల ఏర్పాటు
- బండ్లగూడ, గంధంగూడ, పేట్‌బషీరాబాద్, జల్‌పల్లి లక్ష్మీగూడలో నిర్మాణాలు
- ఒక్కో ప్రాంతంలో 500 ఫ్లాట్లు.. హౌసింగ్ బోర్డు ఆధ్వర్యంలో పనులు

హైదరాబాద్

తెలంగాణ ప్రభుత్వం ఆటో కార్మికుల కోసం ప్రత్యేకంగా ఇందిరమ్మ ఇళ్లను నిర్మించాలని నిర్ణయించింది. హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) పరిధిలోని నాలుగు ప్రాంతాల్లో ఆటోనగర్ కాలనీలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం రూ.220 కోట్లతో 2 వేల ఎల్ఐజీ (అల్పాదాయ వర్గాల) ఫ్లాట్ల నిర్మాణానికి ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం. బండ్లగూడ, గంధంగూడ, పేట్‌బషీరాబాద్, జల్‌పల్లి లక్ష్మీగూడ ప్రాంతాల్లో హౌసింగ్ బోర్డు ఆధ్వర్యంలో ఈ కాలనీలను - మిగతా 3లో

## శాస్త్రీయ అభివృద్ధికి మైసూరు రాజకుటుంబం కృషి



- విజ్ఞానం.. ఆధ్యాత్మికత.. భారతీయ సంస్కృతిలో రెండూ విడదీయలేనివి!
- సైన్స్, స్పిరిచ్యువాలిటీ కలిసే ముందుకు సాగుతాయి..
- చంద్రయాన్-3తో అంతరిక్ష రంగంలో సత్తా చాటాం
- మైసూరులో దేశంలోనే తొలి ఎల్ఈడీ డోమ్ ప్లానిటోరియం ప్రారంభం..
- 100 కి.మీ. మెట్రో నెట్‌వర్క్ క్లబ్‌లో బెంగళూరు




## 'ఆపరేషన్ సిందూర్' ప్రైవేటు భద్రతా సిబ్బంది ప్రాధాన్యాన్ని చాటింది

- మాజీ ఆర్మీ చీఫ్ ఉపేంద్ర ద్వివేది
- దేశంలో కోటి మందికి పైగా ఈ రంగంలో పనిచేస్తున్నారన్న ద్వివేది
- వారి అనుభవానికి గుర్తింపు, నైపుణ్యాలకు ధ్రువీకరణ కల్పించాలని సూచన
- పోలీసు, అగ్నిమాపక విభాగాలతో సమన్వయం పెంచాలని వ్యాఖ్య
- వివిధ సంస్థలు సమన్వయంతో పనిచేయడం వల్లే రక్షణ సాధ్యమైందని వెల్లడి
- భౌతిక ప్రపంచంతో పాటు డిజిటల్ రంగం, ప్రజల ఆలోచనా విధానాల్లోనూ సంఘర్షణలు జరుగుతున్నాయని ద్వివేది


# ఆర్థిక న్యాయమే అభివృద్ధికి పునాది

- భాగ్యనగరంలో భారత్ సమ్మిట్-2026 షురూ!
- తెలంగాణ రైజింగ్‌పై అంతర్జాతీయ వేదికగా చర్చలు..
- తొలిరోజు నాలుగు కీలక అంశాలపై మేధోమథనం
- పట్టణీకరణ, ఫ్యూచర్ సిటీ, ఆర్థిక న్యాయం, సామాజిక న్యాయం, సంక్షేమంపై నిపుణుల అభిప్రాయాలు
- రెండోరోజు రాహుల్ గాంధీ హాజరు.. మరో నాలుగు అంశాలపై చర్చలు




హైదరాబాద్

ప్రపంచ రాజకీయ, ఆర్థిక, సామాజిక పరిణామాలపై సమగ్ర చర్చకు భాగ్యనగరం వేదికగా నిలిచింది. 'ఫోర్జింగ్ ఏ న్యూ వరల్డ్' (కొత్త ప్రపంచ నిర్మాణం) ఇతివృత్తంతో నిర్వహిస్తున్న భారత్ సమ్మిట్--2026 రెండో ఎడిషన్ హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో శుక్రవారం ప్రారంభమైంది. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాలకు చెందిన రాజకీయ నాయకులు, మాజీ ప్రధానులు, మాజీ మంత్రులు, ఎంపీలు, రాయబారులు, విధాన నిర్ణేతలు, మేధావులు, సామాజికవేత్తలు ఈ సదస్సులో పాల్గొంటున్నారు. తొలిరోజు తెలంగాణ రైజింగ్ ఇతివృత్తంగా పట్టణీకరణ, ఫ్యూచర్ సిటీ, ఆర్థిక న్యాయం, సామాజిక న్యాయం, సంక్షేమం వంటి అంశాలపై చర్చలు నిర్వహించారు. తెలంగాణ అభివృద్ధి ప్రణాళికలు, సామాజిక - మిగతా 3లో



## పల్లెలకూ పాకిన గంజాయి మహమ్మారి!

- మత్తులో యువత భవిష్యత్తు చిద్రం.. ఈజీ మనీ కోసం విక్రయదారులుగా మారుతున్న విద్యార్థులు
- అశ్వారావుపేట, దమ్మపేటలో పెరుగుతున్న గంజాయి కేసులు.. గొలుసుకట్టు దుకాణాలే అడ్డాలుగా ఆరోపణలు
- రవాణా, విక్రయాలపై పోలీసుల నిఘా..

అశ్వారావుపేట

ఒకప్పుడు నగరాలకే పరిమితమైన మాదకద్రవ్యాల వినియోగం ఇప్పుడు క్రమంగా గ్రామీణ ప్రాంతాలకూ విస్తరిస్తోంది. ముఖ్యంగా గంజాయి మత్తులో యువత పెడదారి పడుతుండటం ఆందోళన కలిగిస్తోంది. తాత్కాలిక ఆనందం కోసం మొదలయ్యే ఈ అలవాటు చివరకు జీవితాలను చిద్రం చేస్తోంది. కొందరు యువకులు మత్తుకు బానిసలవుతుండగా, మరికొందరు సులభంగా డబ్బు సంపాదించాలనే ఆశతో గంజాయి విక్రయాల వైపు - మిగతా 3లో

## భారత్‌కు ఇంకా సంపూర్ణ ఆహార భద్రత లేదు!

- వంటనూనెల కోసం విదేశీ దిగుమతులపైనే ఆధారం.. ఏటా 17 మిలియన్ టన్నుల దిగుమతి
- అంతర్జాతీయ ధరల హెచ్చుతగ్గులతో దేశీయ మార్కెట్‌పై ప్రభావం..
- ఆహార ఉత్పత్తుల స్వయం సమృద్ధిపై నీతి ఆయోగ్ ఆందోళన



# ఆర్థిక న్యాయమే అభివృద్ధికి పునాది

-మొదటిపేజీ తరువాయి

సమానత్వం, సంక్షేమ విధానాలను అంతర్జాతీయ ప్రతినిధులకు పరిచయం చేయడం ఈ చర్చల ప్రధాన ఉద్దేశం.

**'ఫోర్జింగ్ ఏ న్యూ వరల్డ్' ఇతివృత్తంతో సదస్సు**

ప్రపంచవ్యాప్తంగా మారుతున్న రాజకీయ, ఆర్థిక పరిస్థితులు, ప్రజాస్వామ్య పరిరక్షణ, అంతర్జాతీయ సహకారం, కృత్రిమ మేధ (ఏఐ), వాతావరణ మార్పులు వంటి కీలక అంశాలు భారత్ సమ్మిట్ ఎజెండాలో చోటుచేసుకున్నాయి. వివిధ దేశాలకు చెందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, విధాన నిర్ణేతలు, మేధావులు తమ అనుభవాలను, అభిప్రాయాలను ఈ వేదికపై పంచుకుంటున్నారు. ప్రపంచ సవాళ్లకు పరిష్కార మార్గాలను అన్వేషించడంతో పాటు భవిష్యత్ అభివృద్ధి దిశపై చర్చలు సాగుతున్నాయి.

**పట్టణీకరణ.. ఫ్యూచర్ సిటీపై ప్రత్యేక చర్చ**

తెలంగాణ రైజింగ్ పేరుతో నిర్వహించిన తొలి ప్యానల్ చర్చలో పట్టణీకరణ, భవిష్యత్ నగరాల నిర్మాణం, మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ప్రధానంగా చర్చించారు. పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ఈ చర్చలో పాల్గొని తెలంగాణ ప్రభుత్వం రూపొందిస్తున్న ఫ్యూచర్ సిటీ ప్రణాళికలను వివరించారు. పెరుగుతున్న పట్టణ జనాభాకు అనుగుణంగా రవాణా, నివాసం, పారిశ్రామిక మౌలిక వసతులు, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరాన్ని ప్రతినిధులు ప్రస్తావించారు.

రెండో ప్యానల్ చర్చ ఆర్థిక న్యాయం అంశంపై జరిగింది. పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తదితరులు ఇందులో పాల్గొన్నారు. ఆర్థిక అసమానతలను తగ్గించడం, అభివృద్ధి ఫలాలు సమాజంలోని అన్ని వర్గాలకు అందించడం, సమాన అవకాశాలు కల్పించడం వంటి అంశాలపై చర్చించారు. సంపద కొద్దిమందికే పరిమితం కాకుండా అన్ని వర్గాల ప్రజలకు అభివృద్ధి ఫలాలు అందేలా విధానాలు రూపొందించాల్సిన అవసరాన్ని చర్చకు తీసుకొచ్చారు.

**సామాజిక న్యాయంపై మేధోమథనం**

మూడో ప్యానల్ చర్చలో సామాజిక న్యాయం ప్రధాన అంశంగా నిలిచింది. బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొని తెలంగాణలో సామాజిక న్యాయం అమలు, వెనుకబడిన వర్గాలకు అవకాశాల కల్పనపై అభిప్రాయాలు




పంచుకున్నారు. బీసీలు, ఇతర సామాజికంగా వెనుకబడిన వర్గాలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో తగిన ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరంపై చర్చ సాగింది.

**సంక్షేమ పథకాలపై నాలుగో చర్చ**

సంక్షేమం అంశంపై నిర్వహించిన నాలుగో ప్యానల్ చర్చలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ పాల్గొన్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ఆయా వర్గాల సామాజిక, ఆర్థిక అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను వివరించారు. అట్టడుగు వర్గాలకు సంక్షేమ ఫలాలు చేరడంతో పాటు వారికి ఆర్థికంగా ఎదిగే అవకాశాలు కల్పించడంపై ప్రతినిధులు చర్చించారు.

**రెండోరోజు మరో నాలుగు కీలక అంశాలు**

భారత్ సమ్మిట్ రెండోరోజు కార్యక్రమాల్లో భాగంగా మరో నాలుగు తెలంగాణ రైజింగ్ అంశాలపై చర్చలు నిర్వహించనున్నారు. సహకార సమాఖ్యవాదం, సంస్కృతి- సమాజం, యువత-క్రీడలు-రాజకీయాలు, ఎన్నికల సమగ్రత వంటి అంశాలు చర్చకు రానున్నాయి. అంతర్జాతీయ ప్రతినిధులు ఆయా రంగాల్లో తమ అనుభవాలు, అభిప్రాయాలను వెల్లడించనున్నారు.

**రాహుల్ గాంధీ రాకతో రాజకీయ ప్రాధాన్యం**

రెండోరోజు కార్యక్రమాలకు కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ హాజరుకానున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు, ఇతర ప్రముఖులు కూడా పాల్గొననున్నారు. ముఖ్యంగా గిగ్ వర్కర్ల సంక్షేమం, సామాజిక భద్రతకు సంబంధించిన రాష్ట్ర ప్రభుత్వ విధాన ప్రకటనపై కూడా అందరి దృష్టి నెలకొంది. ప్రపంచ స్థాయి చర్చలకు హైదరాబాద్‌ను వేదికగా నిలపడంతో పాటు తెలంగాణ అభివృద్ధి నమూనా, సామాజిక న్యాయం, సంక్షేమ విధానాలను అంతర్జాతీయ స్థాయిలో పరిచయం చేసేందుకు భారత్ సమ్మిట్ కీలక అవకాశంగా మారింది. రెండోరోజు జరిగే చర్చలు, ప్రముఖుల ప్రసంగాలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

## బీజేపీ, బీఆర్ఎస్‌ది ఒకే వైఖరి

-మొదటిపేజీ తరువాయి

తప్పబట్టారు. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాష్ట్రానికి వస్తుంటే రాజకీయాలకు అతీతంగా స్వాగతం పలకాల్సిన అవసరం ఉందన్నారు. ఢిల్లీలో నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్ కర్టెన్ రైజర్ కార్యక్రమానికి కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ హాజరయ్యారని గుర్తుచేశారు. ఢిల్లీ నాయకులు ఈ కార్యక్రమాన్ని స్వాగతిస్తుంటే, తెలంగాణకు చెందిన కేంద్ర మంత్రి, బీజేపీ నేతలు మాత్రం వ్యతిరేకించడం ఏమిటని ప్రశ్నించారు. కిషన్ రెడ్డి, కేటీఆర్ విజ్ఞతతో వ్యవహరించాలని సూచించారు.

**గిగ్ వర్కర్ల కోసం దేశంలోనే అత్యుత్తమ పాలసీ**

గిగ్ వర్కర్ల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం తీసుకొస్తున్న విధానం దేశంలోనే అత్యుత్తమంగా నిలుస్తుందని సీఎం పేర్కొన్నారు. కార్మికుల హక్కులు, భద్రత, సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ ఈ పాలసీని రూపొందిస్తున్నట్లు తెలిపారు. భారత్ సమ్మిట్‌లో భాగంగా నిర్వహించే గిగ్ వర్కర్ల సమావేశంలో రాహుల్ గాంధీ ప్రసంగిస్తారని వెల్లడించారు.

బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ప్రభుత్వ నిర్ణయాలను వ్యతిరేకించడంలో ఒకే విధంగా వ్యవహరిస్తున్నాయని రేవంత్ రెడ్డి విమర్శించారు. విదేశీ శక్తులు పాల్గొంటున్నాయంటూ బీజేపీ ఆరోపిస్తుంటే, ప్రజాధనం వృథా చేస్తున్నారంటూ బీఆర్ఎస్ విమర్శలు చేస్తోందన్నారు. కిషన్ రెడ్డి, రాంచందర్ రావు, కేటీఆర్‌లు భారత్ సమ్మిట్‌ను ఎందుకు వ్యతిరేకిస్తున్నారో అర్థం కావడం లేదని వ్యాఖ్యానించారు. ప్రపంచ పెట్టుబడిదారులకు తెలంగాణలోని వాతావరణ పరిస్థితులు, పారిశ్రామిక అవకాశాలు, హైదరాబాద్ ప్రాధాన్యతను వివరించడం ద్వారా భారీగా పెట్టుబడులను ఆకర్షించవచ్చని తెలిపారు. ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నా గుడ్డిగా వ్యతిరేకించడం బీజేపీ, బీఆర్ఎస్‌కు అలవాటుగా మారిందని విమర్శించారు. అనవసర ఆరోపణలతో ప్రజలను తప్పుదోవ పట్టించవద్దని హితవు పలికారు.

**2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం**

2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని సీఎం స్పష్టం చేశారు. ఈ దిశగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలు, విదేశీ జర్నలిస్టులను భారత్ సమ్మిట్‌కు ఆహ్వానించినట్లు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా అనేక పరిణామాలు, అలజడులు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో మార్పు అనివార్యమని పేర్కొన్నారు. రాజ్యాంగాన్ని కూడా ఇప్పటివరకు 106 సార్లు సవరించుకున్నామని గుర్తుచేశారు.

**పరిశ్రమలు వస్తేనే యువతకు ఉపాధి**

తెలంగాణలో పరిశ్రమలను ఆకర్షించడం ద్వారా యువతకు పెద్దఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని రేవంత్ రెడ్డి తెలిపారు. పెట్టుబడులకు తెలంగాణ ఎంతో అనుకూలమైన రాష్ట్రమని, హైదరాబాద్‌కు అంతర్జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు ఉందని చెప్పారు. రాష్ట్రంలోని మౌలిక సదుపాయాలు, వనరులు, పారిశ్రామిక అవకాశాలను ప్రపంచానికి చాటిచెప్పేందుకు భారత్ సమ్మిట్ కీలక వేదికగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. బీజేపీ వైఖరి నియంతృత్వ ధోరణిని తలపిస్తోందని విమర్శించారు. రాజకీయ విమర్శలకు అతీతంగా రాష్ట్ర అభివృద్ధికి అందరూ సహకరించాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు.

## ఆటో కార్మికులకు ఇందిరమ్మ ఇళ్లు!




-మొదటిపేజీ తరువాయి

నిర్మించనున్నారు. ఒక్కో ప్రాంతంలో 500 చొప్పున మొత్తం 2 వేల ఫ్లాట్లు అందుబాటులోకి రానున్నాయి. ఆటో కార్మికులకు గృహ వసతి కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది.

**ఇందిరమ్మ టవర్ల విధివిధానాలే వర్తింపు**

ఇప్పటికే క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఎల్ఐజీ టవర్ల నిర్మాణాన్ని ప్రభుత్వం చేపడుతోంది. ఈ పథకానికి సంబంధించిన విధివిధానాలు, అర్హతలు, లబ్ధిదారుల ఎంపిక, కేటాయింపు ప్రక్రియనే ఆటోనగర్ కాలనీలకు కూడా వర్తింపజేయనున్నట్లు జీవోలో స్పష్టం చేసినట్లు సమాచారం. దీంతో అర్హులైన ఆటో కార్మికులకు ఈ పథకం ద్వారా ఇళ్లను కేటాయించే అవకాశం ఉంది.

**ఐదు జిల్లాల్లోనూ ఇందిరమ్మ టవర్లు**

మరోవైపు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లోనూ అల్పాదాయ కుటుంబాలకు గృహ వసతి కల్పించేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ టవర్ల నిర్మాణానికి చర్యలు చేపడుతోంది. నిజామాబాద్, నల్గొండ, మహబూబ్‌నగర్, వరంగల్, హనుమకొండ జిల్లాల్లో ఈ టవర్లను నిర్మించాలని నిర్ణయించింది. హౌసింగ్ బోర్డు భూముల్లో సుమారు రూ.204 కోట్లతో 2,400 ఎల్ఐజీ ఫ్లాట్ల నిర్మాణం చేపట్టనుంది.

**దరఖాస్తులకు ఆహ్వానం**

ఈ ఫ్లాట్ల కేటాయింపు కోసం అర్హులైన అల్పాదాయ కుటుంబాల నుంచి హౌసింగ్ బోర్డు దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. మీ సేవ కేంద్రాల ద్వారా రూ.10 వేల డిపాజిట్ చెల్లించి డిసెంబర్ 5వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించినట్లు కథనంలో పేర్కొన్నారు. దరఖాస్తు చేసే ముందు అర్హతలు, డిపాజిట్ నిబంధనలు, తిరిగి చెల్లింపు విధానం వంటి వివరాలను అధికారిక ప్రకటనలో పరిశీలించడం మంచిది.

# పల్లెలకూ పాకిన గంజాయి మహమ్మారి!

-మొదటిపేజీ తరువాయి

అడుగులు వేస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లో గంజాయి రవాణా, వినియోగానికి సంబంధించిన ఘటనలు వెలుగులోకి వస్తుండటం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. ఆయా ప్రాంతాల్లోని కొన్ని కాలనీలు, ప్రధాన రహదారుల వెంట గంజాయి విక్రయాలు జరుగుతున్నాయనే ఆరోపణలు స్థానికంగా కలకలం రేపుతున్నాయి.

**వరుసగా వెలుగులోకి వస్తున్న కేసులు**

అశ్వారావుపేట, దమ్మపేట పరిసర ప్రాంతాల్లో గత కొంతకాలంగా గంజాయి రవాణా, నిల్వ, విక్రయాలకు సంబంధించిన పలు ఘటనలు వెలుగులోకి వచ్చాయి. పోలీసులు తనిఖీలు నిర్వహిస్తూ గంజాయిని స్వాధీనం చేసుకోవడంతో పాటు పలువురిని అదుపులోకి తీసుకున్నారు.

**ఇటీవల వెలుగుచూసిన కొన్ని ఘటనలు:**

- చిల్లగుంపులో ఐదు కిలోలు: దమ్మపేట మండలం చిల్లగుంపులో పోలీసులు ఐదు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.
- సత్తుపల్లిలో 80 మందికి పైగా అదుపులోకి: గంజాయి వ్యవహారానికి సంబంధించి నిర్వహించిన చర్యల్లో దాదాపు 80 మందిని పోలీసులు అదుపులోకి తీసుకోగా, వారిలో ఎక్కువమంది యువకులే ఉండటం చర్చనీయాంశమైంది.
- అచ్యుతాపురంలో 100 కిలోలు: గత జూలైలో అచ్యుతాపురంలోని ఆయిల్‌పామ్ తోటలో 100 కిలోల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు.
- సరిహద్దులో భారీ పట్టివేత: గత ఏడాది ఆగస్టులో విశాఖపట్నం నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్న రెండు క్వింటాళ్ల గంజాయిని ఏపీ--తెలంగాణ సరిహద్దులో



స్వాధీనం చేసుకున్నారు.

- రూ.2 కోట్ల విలువైన గంజాయి: విశాఖపట్నం అటవీ ప్రాంతాల నుంచి తరలిస్తున్నట్లు గుర్తించిన సుమారు రూ.2 కోట్ల విలువైన గంజాయిని పోలీసులు పట్టుకున్నారు.

ఈ ఘటనలు గంజాయి సరఫరా నెట్‌వర్క్ విస్తృతిని, అక్రమ రవాణాను అడ్డుకోవాల్సిన అవసరాన్ని తెలియజేస్తున్నాయి.

**ఈజీ మనీ ఆశతో విక్రయదారులుగా యువత**

గంజాయి వినియోగం కంటే దాని సరఫరా వ్యవస్థ మరింత ఆందోళన కలిగిస్తోంది. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే ఆశతో కొందరు యువకులు అక్రమ విక్రయాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. విద్యార్థులు సైతం ఈ వ్యవహారాల్లో భాగస్వాములవుతున్న ఘటనలు వెలుగులోకి వస్తుండటం తల్లిదండ్రులను కలవరపెడుతోంది.

విద్యాసంస్థలకు సంబంధించిన కొందరు సిబ్బంది కూడా సులభంగా డబ్బు సంపాదించాలనే ప్రలోభానికి లోనై మాదకద్రవ్యాల విక్రయాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. సరఫరా వెనుక ఉన్న ప్రధాన వ్యక్తులు, నెట్‌వర్క్‌లను గుర్తించడం పోలీసులకు సవాలుగా మారుతోంది.

**గొలుసుకట్టు దుకాణాలపై ఆరోపణలు**

మారుమూల గ్రామాలు, కాలనీలకు సైతం గంజాయి చేరుతున్నట్లు స్థానికుల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో గొలుసుకట్టు దుకాణాలు అక్రమ కార్యకలాపాలకు అడ్డాలుగా మారుతున్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఈ ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలికితీయాల్సిన అవసరం ఉంది. గంజాయి విక్రయాలకు పాల్పడుతున్న వ్యక్తులతో పాటు సరఫరా వెనుక ఉన్న నెట్‌వర్క్‌ను గుర్తిస్తేనే సమస్యను సమర్థంగా అరికట్టే అవకాశం ఉంటుంది.

**యువతను కాపాడాల్సిన బాధ్యత అందరిదీ**

గంజాయి వ్యసనం ఒక్క వ్యక్తి జీవితాన్నే కాకుండా కుటుంబం, సమాజంపై కూడా ప్రభావం చూపుతుంది. మత్తు పదార్థాల అలవాటు వల్ల చదువు, ఉపాధి, కుటుంబ సంబంధాలు దెబ్బతినే ప్రమాదం ఉంది. యువతలో మానసిక, సామాజిక సమస్యలు తలెత్తకుండా ముందస్తు అవగాహన అవసరం. పాఠశాలలు, కళాశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనపై దృష్టి సారించాలి. గంజాయి సరఫరా చేసే ముఠాలపై పోలీసుల నిఘా మరింత పెరగాలి. కేవలం కేసులు నమోదు చేయడమే కాకుండా సరఫరా మూలాలను గుర్తించి అరికట్టాలి. మత్తు మాయలో పడి యువత భవిష్యత్తు నాశనం కాకుండా పోలీసు యంత్రాంగం, విద్యాసంస్థలు, తల్లిదండ్రులు, ప్రజలు సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉంది.

## తెలంగాణ జైళ్ల శాఖకు అరుదైన గౌరవం.. ఒకేసారి 6 ఐఎస్ఓ సర్టిఫికెట్లు

తెలంగాణ కారాగారాలు, సంస్కరణ సేవల విభాగం దేశంలోనే మునుపెన్నడూ లేని విధంగా అరుదైన రికార్డును సొంతం చేసుకుంది. చర్లపల్లి సెంట్రల్ జైలుతో పాటు చంచల్‌గూడలోని స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కరెక్షనల్ అడ్మినిస్ట్రేషన్ సంస్థలు మొత్తం 6 ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ ఐఎస్ఓ సర్టిఫికెట్లను సాధించాయి. భారత జైళ్ల చరిత్రలోనే ఒక రాష్ట్ర కారాగారాల శాఖకు ఒకేసారి ఇన్ని ఐఎస్ఓ గుర్తింపులు లభించడం ఇదే తొలిసారి అని డెక్కన్ క్రానికల్ తన కథనంలో పేర్కొంది. ప్రపంచ క్వాలిటీ వీక్ (నవంబర్ 9 నుంచి 13 వరకు), నాణ్యతా మాసోత్సవాల సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో తెలంగాణ జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సౌమ్య మిశ్రా ఈ సర్టిఫికెట్లను అధికారులకు అందజేశారు. చర్లపల్లి సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ జి. ప్రమోద్, చంచల్‌గూడ సికా ప్రిన్సిపాల్ ఎస్. శ్రీనివాసరెడ్డి సంబంధిత ధ్రువపత్రాలను స్వీకరించారు.

**చర్లపల్లి సెంట్రల్ జైలుకు లభించిన సర్టిఫికెట్లు:**

1. ఐఎస్ఓ 9001 -- క్వాలిటీ మేనేజ్‌మెంట్ సిస్టమ్
2. ఐఎస్ఓ 14001 -- ఎన్విరాన్‌మెంటల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (పర్యావరణ పరిరక్షణ)
3. ఐఎస్ఓ 50001 -- ఎనర్జీ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఇంధన నిర్వహణ)
4. ఐఎస్ఓ 22000 -- ఫుడ్ సేఫ్టీ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఆహార భద్రత)

**చంచల్‌గూడ సికా సంస్థకు లభించినవి:**



1. ఐఎస్ఓ 9001 -- క్వాలిటీ మేనేజ్‌మెంట్ సిస్టమ్
2. ఐఎస్ఓ 22000 -- ఫుడ్ సేఫ్టీ మేనేజ్‌మెంట్ సిస్టమ్

**గుర్తింపు తెచ్చిన ప్రధాన అంశాలు:**

జైళ్లలో పచ్చదనం పెంపొందించడం, పర్యావరణ రక్షణకు ప్రాధాన్యం ఇవ్వడం, సోలార్ విద్యుత్ వినియోగం మరియు ఇంధన ఆదాతో పాటు వనరులను సద్వినియోగం చేసుకోవడంలో చూపిన చొరవకు ఈ గుర్తింపు దక్కింది. ఖైదీలకు అందించే ఆహార తయారీలో పరిశుభ్రత, శుభ్రమైన వాతావరణం, ఆవిరితో అన్నం వండే స్టీమ్ కుకింగ్ వ్యవస్థ, ఆహార ట్రేలపై మూతలు ఉంచి భోజనం పంపిణీ చేసే విధానం ఆహార భద్రత విభాగంలో ప్రత్యేక ప్రశంసలు పొందాయి. అలాగే పాలనాపరమైన ప్రక్రియలను క్రమబద్ధీకరించడం, రికార్డులను పక్కాగా నిర్వహించడం, నిబంధనలను కచ్చితంగా అమలు చేయడం ద్వారా పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంచినందుకు నాణ్యతా విభాగంలో సర్టిఫికెట్లు లభించాయి. ఈ సందర్భంగా డాక్టర్ సౌమ్య మిశ్రా మాట్లాడుతూ, తమ శాఖ నాణ్యత, జవాబుదారీతనం, పర్యావరణ పరిరక్షణ, విద్యుత్ పొదుపు మరియు ఆహార భద్రత పట్ల చూపుతున్న నిబద్ధతకు ఈ సర్టిఫికెట్లు నిదర్శనమని కొనియాడారు. ఈ ఉన్నత ప్రమాణాలను నిరంతరం పర్యవేక్షిస్తూ, భవిష్యత్తులోనూ సమర్థవంతంగా కొనసాగించాలని అధికారులను ఆదేశించారు.

## ట్రాఫిక్ ఉల్లంఘనలకు రూ.311 కోట్ల జరిమానాలు!

**తొమ్మిది నెలల్లో హైదరాబాద్ వాహనదారులపై భారీగా చలాన్లు**

**- కుల్సుంపుర పరిధిలో అత్యధికంగా రూ.22 కోట్లు**

**- సైదాబాద్ పరిధిలో అత్యల్పంగా రూ.4 కోట్లు**

**- జరిమానాలు విధిస్తున్నా మారని కొందరి వాహనదారుల తీరు**

**హైదరాబాద్:** నగరంలో ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలు ఆందోళన కలిగిస్తున్నాయి. కేవలం తొమ్మిది నెలల వ్యవధిలోనే ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులపై మొత్తం రూ.311 కోట్ల జరిమానాలు విధించినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. అయినప్పటికీ కొందరు వాహనదారుల్లో మార్పు కనిపించడం లేదు. హెల్మెట్, సీట్‌బెల్ట్ లేకుండా ప్రయాణించడం, అతివేగం, రాంగ్ రూట్‌లో వెళ్లడం వంటి ఉల్లంఘనలు కొనసాగుతుండటంతో ప్రమాదాల ముప్పు పెరుగుతోంది. ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన జరిమానాల్లో కుల్సుంపుర అగ్రస్థానంలో ఉంది. ఈ ప్రాంతంలో తొమ్మిది నెలల్లో సుమారు రూ.22 కోట్ల జరిమానాలు విధించారు. సైదాబాద్ పరిధిలో అత్యల్పంగా రూ.4 కోట్ల జరిమానాలు నమోదయ్యాయి. నగరంలోని అబిడ్స్, ఆసిఫ్‌నగర్, గుడిమల్కాపూర్, అత్తాపూర్, చిలకలగూడ, బంజారాహిల్స్ తదితర ప్రాంతాల్లోనూ పెద్ద సంఖ్యలో ట్రాఫిక్ ఉల్లంఘనలు నమోదవుతున్నట్లు సమాచారం. ట్రాఫిక్ పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్నా, సీసీ కెమెరాల ద్వారా ఉల్లంఘనలను గుర్తించి చలాన్లు విధిస్తున్నా కొందరు వాహనదారుల ప్రవర్తనలో మార్పు రావడం లేదు. హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించకపోవడం, అతివేగంగా వాహనాలు నడపడం, సిగ్నల్ జంప్ చేయడం, వన్‌వేలో ఎదురుదిశగా ప్రయాణించడం వంటి ఉల్లంఘనలు తరచూ కనిపిస్తున్నాయి. ఒకే ద్విచక్ర వాహనంపై ఏడాది వ్యవధిలోనే రూ.20 వేలకు పైగా జరిమానాలు నమోదైన సందర్భాలు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. రాంగ్ రూట్‌లో వాహనాలు నడపడం ప్రమాదాలకు ప్రధాన కారణాల్లో ఒకటిగా మారుతోంది. నల్లకుంటలోని ఫీవర్ ఆసుపత్రి సమీపంలో వ్యతిరేక దిశలో వస్తున్న వాహనాన్ని తప్పించుకునే క్రమంలో మోటార్‌సైకిల్‌పై ప్రయాణిస్తున్న ఓ విద్యార్థి సిటీ బస్సు కిందపడి మృతి చెందిన ఘటన ఈ నిర్లక్ష్యానికి ఉదాహరణగా నిలిచింది.

## ప్రతి వర్షపు చుక్క భూమిలోకి.. భూగర్భ జలాల పెంపునకు మధురనగర్‌లో ప్రత్యేక కార్యాచరణ

భూగర్భ జలాల పెంపునకు సామాజిక కార్యకర్త సాబ్లే సంతోష్ సింగ్ ప్రత్యేక చొరవ



సికె.న్యూస్. నేరడిగొండ నేరడిగొండ: వర్షపు నీటిని వృథా కాకుండా భూమిలోకి ఇంకింపజేసి భూగర్భ జలాలను పెంపొందించాలనే లక్ష్యంతో నేరడిగొండ గ్రామపంచాయతీ పరిధిలోని 7వ వార్డు మధురనగర్ కాలనీలో ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు. సామాజిక కార్యకర్త సాబ్లే సంతోష్ సింగ్, నేరడిగొండ ఉపసర్పంచ్ గోతి గులాబ్ సింగ్, గ్రామపంచాయతీ కార్యదర్శి అరుణ్, గ్రామపంచాయతీ కారోబారి పోశెట్టి కలిసి కాలనీలో విస్తృతంగా పర్యటించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలతో మాట్లాడి ఇంకుడు గుంతల అవసరాన్ని వివరించారు. వర్షపు నీటిని ఒడిసిపట్టి భూమిలోకి ఇంకింపజేసేందుకు ప్రతి ఇంటికి ఇంకుడు గుంతలు మంజూరు చేయించేలా చొరవ తీసుకున్నారు.ఈ సందర్భంగా సాబ్లే సంతోష్ సింగ్ మాట్లాడుతూ.. ప్రస్తుతం భూగర్భ జలాలు తగ్గిపోతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ నీటి సంరక్షణపై బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. వర్షపు నీరు కాలువల ద్వారా బయటకు వెళ్లిపోకుండా ఇంకుడు గుంతల ద్వారా భూమిలోకి చేరేలా చేయడం వల్ల భూగర్భ జలమట్టం పెరుగుతుందని తెలిపారు. దీనివల్ల బోర్లు, బావుల్లో నీటి నిల్వలు మెరుగుపడటంతో పాటు భవిష్యత్తులో తాగునీటి సమస్యలను కొంతవరకు నివారించవచ్చని పేర్కొన్నారు. ఇంకుడు గుంతలు కేవలం ఒక నిర్మాణం మాత్రమే కాదని, రాబోయే తరాలకు నీటిని అందించే విలువైన సంపద అని ఆయన అన్నారు. ప్రతి ఇంటి యజమాని ఇంకుడు గుంతను నిర్మించుకోవడంతో పాటు దానిని శుభ్రంగా నిర్వహించుకోవాలని, వర్షపు నీటిని ప్రతి చుక్కను ఒడిసిపట్టేలా ప్రజల్లో అవగాహన పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. నీటిని కాపాడితేనే భవిష్యత్తును కాపాడుకోగలం.. ప్రతి ఇంటా ఇంకుడు గుంత, ప్రతి గ్రామంలో జలసంరక్షణ అనే నినాదంతో ప్రజలందరూ నీటి సంరక్షణ ఉద్యమంలో భాగస్వాములు కావాలని వారు కోరారు. అలాగే మురుగు నీరు ఆగి ఉన్న ప్రదేశంలో గ్రామపంచాయతీ ద్వారా కమ్యూనిటీ ఇంకుడుగుంతలను మంజూరు చేయించి వెంటనే పని ప్రారంభించేలా చూడలని కోరారు. ఈ కార్యక్రమం ద్వారా మధురనగర్ కాలనీలో జలసంరక్షణపై ప్రజల్లో అవగాహన పెంపొందించడమే కాకుండా, పర్యావరణ పరిరక్షణ దిశగా గ్రామపంచాయతీ ముందడుగు వేసింది. ఈ కార్యక్రమంలో కాలానివాసులు షాకీర్, సాప్, యూనుస్, జియాఉల్లా, నయీమ్, సమీర్, తదితరులు ఉన్నారు.

## రోడ్డు ప్రమాదంలో చుక్కల దుప్పి మృతి.. ద్విచక్ర వాహన దారుడికి తీవ్ర గాయాలు



సికె న్యూస్ నవంబర్ 13 మహబూబాబాద్ జిల్లా (పతినిధి: దుర్గం మురళి
మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం దామరవంచ బస్టాండ్ సమీపంలోని అటవీ ప్రాంతంలో జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది.
అటవీ ప్రాంతం నుండి ఒక చుక్కల దుప్పి రోడ్డు దాటుతుండగా, జాతీయ రహదారిపై వేగంగా వస్తున్న ద్విచక్ర వాహనదారుడు దానిని ఢీకొట్టాడు.
ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన చుక్కల దుప్పి అక్కడికక్కడే మృతి చెందింది. బైక్ పై నుండి కిందపడిన వాహనదారుడికి తీవ్ర గాయాలు కావడంతో, స్థానికులు 108 అంబులెన్స్ ద్వారా గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు సమాచారం అందుకున్న గూడూరు అటవీ శాఖ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మృతి చెందిన చుక్కల దుప్పిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పంచనామా నిర్వహించి, అటవీ ప్రాంతంలో పూడ్చిపెట్టారు.

## ఎల్ నీ నో ప్రభావం, ప్రజలు నీళ్ళు, కరెంట్ పాదుపు గా వాడాలి,

కరీంనగర్ ఇబ్రహీంపూర్‌లో ఎల్ నినో గ్రామసభ,

ఇంకుడు గుంతని పరిశీలించిన,ఎంపీడీవో చెన్నారెడ్డి,

(సీ కే న్యూస్) చేగుంట:



చేగుంట మండలంలోని కరీంనగర్ ఇబ్రహీంపూర్ గ్రామంలో ఎల్ నినో గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామసభకు ఎంపీడీవో చిన్నారెడ్డి, ఎంపీవో ప్రకాష్, ఏపీవో శ్వేత, హౌసింగ్ ఏఈ రియాజుద్దీన్, వ్యవసాయ అధికారి హరిప్రసాద్‌తో పాటు ఇతర మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సర్పంచులు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా ఎంపీడీవో చిన్నారెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తులో ఎల్ నినో ప్రభావంతో ఎదురయ్యే నీటి సమస్యలు, తాగునీటి కొరతపై ప్రజలకు వివరించారు. నీటి వృథాను అరికట్టి, అందుబాటులో ఉన్న నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు.ఏపీవో శ్వేత మాట్లాడుతూ వర్షపు నీటిని భూమిలోకి ఇంకేలా ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టాలని, ఉపాధి హామీ పథకం కింద జాబ్ కార్డుల ప్రాధాన్యత, వాటి వినియోగం గురించి వివరించారు. గ్రామాల్లో నీటి సంరక్షణ పనులను ప్రజల భాగస్వామ్యంతో చేపట్టాలని సూచించారు.ఈ గ్రామసభలో వివిధ శాఖల అధికారులు ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, గ్రామాల అభివృద్ధి, నీటి సంరక్షణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

# బైక్‌కే ట్రాలీ.. ఆలోచనకు హ్యాట్సాఫ్!

వినూత్న ఆలోచనతో ద్విచక్ర వాహనానికి ప్రత్యేక ఏర్పాటు.. పత్తి రవాణాకు సరికొత్త ప్రయోగం



సీకే న్యూస్ ఖమ్మం ప్రతినిధి ఇస్లావత్ నరసింహ నవంబర్ 13 2026: అవసరం కొత్త ఆలోచనలకు నాంది పలుకుతుందన్న మాటకు ఈ వినూత్న ప్రయోగం నిదర్శనంగా నిలుస్తోంది. సాధారణంగా పత్తి, ధాన్యం వంటి వ్యవసాయ ఉత్పత్తులను తరలించాలంటే ట్రాక్టర్లు, ఆటోలు లేదా ఇతర సరుకు రవాణా వాహనాలను ఆశ్రయిస్తుంటారు. ఇందుకోసం ప్రత్యేకంగా రవాణా వాహనాలను ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. అయితే ఇందుకు భిన్నంగా ఓ వ్యక్తి వినూత్నంగా ఆలోచించి ఏకంగా ద్విచక్ర వాహనానికే ట్రాలీని జోడించి అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాడు.మోటార్ సైకిల్ వెనుక భాగంలో ప్రత్యేకంగా ఇనుప ట్రాలీని రూపొందించి అనుసంధానం చేశాడు. ట్రాలీకి ఇనుప చువ్వలతో కూడిన రక్షణ ఏర్పాటు చేసి అందులో పత్తిని నింపి తరలించే విధంగా తయారుచేశాడు. సాధారణంగా ఒక ద్విచక్ర వాహనం ప్రయాణానికి మాత్రమే పరిమితమవుతుండగా, దానికి అదనంగా ట్రాలీని జోడించి సరుకుల రవాణాకు ఉపయోగపడేలా చేయడం విశేషం. ఫోటోలో కనిపిస్తున్న ఈ ఏర్పాటు చూస్తే ఆ వ్యక్తి ఆలోచనాత్మకత స్పష్టంగా కనిపిస్తోంది.
ముఖ్యంగా వ్యవసాయ పనుల్లో చిన్నచిన్న అవసరాల కోసం రైతులు వివిధ రకాల వాహనాలపై ఆధారపడుతుంటారు. అలాంటి సమయంలో అందుబాటులో ఉన్న వాహనాలను వినూత్నంగా వినియోగించాలనే ఆలోచన ఇలాంటి ప్రయోగాలకు దారితీస్తోంది. తక్కువ ఖర్చుతో రవాణా సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకురావాలనే ఆలోచనతో ఈ తరహా ఏర్పాట్లు చేస్తున్నట్లు కనిపిస్తోంది.
అవసరమే ఆవిష్కరణకు మూలం! అన్నట్లుగా సాధారణ ద్విచక్ర వాహనాన్ని సరుకు రవాణాకు అనువుగా మార్చిన ఈ ప్రయోగం స్థానికంగా ఆసక్తిని రేకెత్తిస్తోంది. అయితే ద్విచక్ర వాహనాలకు ట్రాలీలను అనుసంధానం చేసి రహదారులపై నడిపేటప్పుడు వాహన సామర్థ్యం, బ్రేకులు, బరువు, రహదారి భద్రతతో పాటు సంబంధిత రవాణా నిబంధనలు తప్పనిసరిగా పాటించాల్సిన అవసరం ఉంది.

## వాగులో దిగబడిన బొలెరో.. ఎప్పుడు నిర్మిస్తారు బ్రిడ్జి?



మంజూరై ఏళ్లు గడుస్తున్నా ప్రారంభంకాని పనులు.. ప్రజల ప్రాణాలతో చెలగాటమా?

ఆరికాయలపాడు -- జన్నారం మధ్య తప్పని వాగు కష్టాలు..

అధికారుల నిర్లక్ష్యంపై గ్రామస్తుల ఆగ్రహం

సీకే న్యూస్ ఖమ్మం ప్రతినిధి ఇస్లావత్ నరసింహ నవంబర్ 13 2026: ఏన్కూరు మండలం ఆరికాయలపాడు -- జన్నారం గ్రామాల మధ్య వాగు దాటాలంటే వాహనదారులకు ప్రాణసంకటంగా మారింది. వాగుపై శాశ్వత బ్రిడ్జి లేకపోవడంతో నిత్యం రాకపోకలు సాగించే గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాజాగా జన్నారం నుంచి పంగిడికి వెళ్తున్న బొలెరో వాహనం వాగులో దిగబడటంతో ఈ మార్గంలోని ప్రమాదకర పరిస్థితి మరోసారి వెలుగులోకి వచ్చింది. వాహనం వాగులో చిక్కుకుపోవడంతో స్థానిక యువకులు తీవ్రంగా శ్రమించి బయటకు తీశారు. అదృష్టవశాత్తూ ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.అయితే ఈ ఘటనతోనైనా సంబంధిత అధికారుల్లో కదలిక వస్తుందా? అనే ప్రశ్నలు గ్రామస్తుల నుంచి వ్యక్తమవుతున్నాయి. వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి ఇప్పటికే మంజూరు లభించినప్పటికీ, పనులు మాత్రం ఇప్పటివరకు ప్రారంభం కాకపోవడం పట్ల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. నిధులు మంజూరైనప్పుడు కనిపించే హడావుడి.. నిర్మాణ పనుల దగ్గరకు వచ్చేసరికి ఎందుకు కనిపించడం లేదని ప్రశ్నిస్తున్నారు.వర్షాకాలంలో వాగులో నీరు ప్రవహించే సమయంలో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారుతోంది. ద్విచక్ర వాహనదారులు, ఆటోలు, కార్లు, వ్యవసాయ వాహనాలు ఈ మార్గంలో ప్రయాణించాలంటే భయాందోళనకు గురవుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో రోగులను ఆసుపత్రులకు తరలించాల్సి వచ్చినా ఇదే మార్గం సమస్యగా మారే ప్రమాదం ఉంది.

### ప్రమాదం జరిగాక స్పందిస్తారా?

ప్రజలు ప్రమాదాలను ఎదుర్కొంటున్నా అధికారులు, సంబంధిత నిర్మాణ శాఖ ఇప్పటివరకు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. మరో వాహనం వాగులో చిక్కుకోవడమో, ప్రాణనష్టం సంభవించడమో జరిగితేనే అధికారులు స్పందిస్తారా? అని నిలదీస్తున్నారు. బ్రిడ్జి నిర్మాణానికి మంజూరు వచ్చిన తర్వాత కూడా పనులు ప్రారంభించకపోవడానికి గల కారణాలను అధికారులు ప్రజలకు వెల్లడించాల్సిన అవసరం ఉంది.

### ఇప్పటికైనా పనులు ప్రారంభించాలి

సంబంధిత అధికారులు ఇకనైనా కాలయాపనకు స్వస్తి పలికి బ్రిడ్జి నిర్మాణ పనులను తక్షణమే ప్రారంభించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. నిర్మాణం పూర్తయ్యే వరకు వాగు దాటేందుకు సురక్షితమైన తాత్కాలిక మార్గాన్ని ఏర్పాటు చేయడంతో పాటు, ప్రస్తుతం ఉన్న వాగు దారికి అత్యవసర మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. మంజూరైన బ్రిడ్జి కాగితాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో నిర్మాణం ప్రారంభమయ్యేలా ఉన్నతాధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## కొమరం భీం కాలనీలో తుడుం దెబ్బ మావల మండల కమిటీ ఆధ్వర్యంలో



ప్రజాకవి కాళోజీ నారాయణరావు వర్ధంతిని ఘనంగా జరుపుకొని నివాళులు అర్పించారు

ఈ సందర్భంగా తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షులు గోడం గణేష్ మాట్లాడుతూ

సికె.న్యూస్. ప్రతినిధి ఆదిలాబాద్: కాళోజి నారాయణరావు 1914 సెప్టెంబర్ 9న జన్మించి 2002 నవంబర్ 13న మరణించారు. తన జీవితమంతా ప్రజల కోసం, ప్రజాస్వామ్య విలువల కోసం, సామాజిక న్యాయం కోసం పోరాడిన గొప్ప వ్యక్తి. అందుకే ఆయనను ప్రజలు ప్రేమగా ప్రజాకవి, కాళన్న అని పిలుచుకున్నారు.
కాళోజీ నారాయణరావు కేవలం కవి మాత్రమే కాదు, ప్రజల కష్టాలను తన కవిత్వంలో ప్రతిబింబించిన సామాజిక చైతన్యవాది. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగిన ఉద్యమాల్లో పాల్గొని జైలు జీవితాన్ని కూడా అనుభవించారు. స్వాతంత్ర్య ఉద్యమం, ఆర్యసమాజ ఉద్యమం, గ్రంథాలయ ఉద్యమం, ఆంధ్ర మహాసభ కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొన్నారు.సమాజంలో కొనసాగుతున్న కుల వివక్ష, అంటరానితనం, పేదరికం, దోపిడీ, అన్యాయాలపై తన కలం ద్వారా నిరంతరం పోరాటం చేశారు. అధికారం ముందు తలవంచకుండా ప్రజల పక్షాన నిలబడి ప్రశ్నించే ధైర్యాన్ని తన రచనల ద్వారా చాటిచెప్పారు
కాళోజీ రచించిన 'నా గొడవ' తెలుగు సాహిత్యంలో ప్రత్యేక గుర్తింపు పొందింది. ఆయన రచనలు సామాన్య ప్రజల జీవితాలను, వారి బాధలను, ఆకాంక్షలను, ఆవేదనలను ప్రతిబింబించాయి. తెలంగాణ మాండలిక భాషకు, యాసకు, సంస్కృతికి తన రచనల ద్వారా విశేష గౌరవాన్ని తీసుకొచ్చారు.తెలుగు మాత్రమే కాకుండా తదితర భాషల సాహిత్యంతోనూ అనుబంధం కలిగి ఉండి అనువాద రంగానికి సేవలందించారు. ఆయన సాహిత్య సేవలకు గుర్తింపుగా 1992లో భారత ప్రభుత్వం పద్మవిభూషణ్ పురస్కారంతో గౌరవించింది.
అదేవిధంగా కాళోజి తెలంగాణ ప్రజల భాష, యాస, సంస్కృతి, ఆత్మగౌరవం కోసం జీవితాంతం కృషి చేశారు. ప్రజల హక్కులను కాపాడటం, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడం, అణగారిన వర్గాలకు న్యాయం జరగాలని కోరుకోవడం ఆయన జీవిత లక్ష్యాలుగా నిలిచాయి.
ఆయన ఆశయాలు నేటికీ ఆదివాసీలు, దళితులు, బహుజనులు, కార్మికులు, రైతులు, పేద ప్రజల హక్కుల పోరాటాలకు స్ఫూర్తినిస్తున్నాయి.
ఆయన చూపిన మార్గంలో నడుస్తూ సమాజంలో సమానత్వం, సామాజిక న్యాయం, మానవ హక్కులు, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరుతున్నాం
ప్రజల కోసం బతికిన మహనీయుడు కాళోజీ.
ప్రజల గొంతుకగా నిలిచిన ప్రజాకవి కాళోజీ.
ఆయన ఆశయాలు అజరామరం -- ఆయన పోరాట స్ఫూర్తి తరతరాలకు ఆదర్శం.
కార్యక్రమంలో పాల్గొన్నవారు గోడం గణేష్ తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షులు అర్కా శేషారావు రాష్ట్ర కార్యదర్శి గోడం రేణుక ఆదివాసి మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉయిక ఇందిరా మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆత్రం గణపతి డివిజన్ అధ్యక్షులు
వెడ్మ ముకుందరావు మావల మండలం
అధ్యక్షుడు కుమర గోవిందరావు కనక మనోహర్ సీడం ప్రభు కొమురమల్కు తదితరులు పాల్గొన్నారు

## 108, 102 అంబులెన్స్ సేవలను సద్వినియోగం చేసుకోండి...

అత్యవసర సమయాల్లో ప్రజలకు అండగా 108 సేవలు: ఉమ్మడి జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ రవి



పెబ్బేరు, నవంబర్ 13 (సి కే న్యూస్):పెబ్బేరు మండల కేంద్రంలోని 108, 102 అంబులెన్స్ సేవలను ఉమ్మడి జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ కే. రవి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా అంబులెన్స్‌లలో ఉన్న మందులు,ఆక్సిజన్,వైద్య పరికరాల పనితీరుతో పాటు నిర్వహిస్తున్న రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ.. మండల ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రికి వెళ్లాల్సి వచ్చినప్పుడు 108 అంబులెన్స్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.అదేవిధంగా గర్భిణీ స్త్రీలను ప్రసవ పరీక్షల నిమిత్తం ఆసుపత్రికి తీసుకెళ్లడానికి, పరీక్షలు పూర్తయిన అనంతరం తిరిగి ఇంటి వద్దకు చేర్చడానికి అమ్మ ఒడి 102 అంబులెన్స్ సేవలను వినియోగించుకోవాలని కోరారు.అనంతరం పెబ్బేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ నాదియా సాదర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి, 108, 102 అంబులెన్స్ సేవలపై ప్రజలకు అవగాహన కల్పించి ప్రతి ఒక్కరూ వాటిని వినియోగించుకునేలా కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ దుర్గాప్రసాద్, టెక్నీషియన్ మాసూమ్ బాబా, పైలట్ మొయినుద్దీన్ తదితరులు పాల్గొన్నారు

## జవహర్ నగర్ మాజీ మేయర్ మేకల కావ్య గారి పుట్టినరోజు వేడుకలు

కేక్ కట్ చేయించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసిన మేడ్చల్ శాసన సభ్యులు మల్లారెడ్డి గారు



సీకే న్యూస్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ రంజిత్ :మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ బిఆర్ఎస్ మాజీ మేయర్ మేకల కావ్య గారి పుట్టినరోజు సందర్భంగా బోయినపల్లి క్యాంపు కార్యాలయంలో కుటుంబంతో కలిసి వారి ఇంటికి వెళ్లి వారి ఆశీస్సులు తీసుకున్న మాజీ మేయర్ మేకల కావ్య ఈ సందర్భంగా మేడ్చల్ శాసనసభ్యులు మల్లారెడ్డి గారు వారితో కేక్ కట్ చేయించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు ఈ సందర్భంగా మల్లారెడ్డి గారు మాట్లాడుతూ జవహర్ నగర్ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ పలు సేవా కార్యక్రమంలో పాల్గొంటూ పలు అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నటువంటి మాజీ మేయర్ మేకల కావ్యగారు ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని ఆ దేవుని ఆశీస్సులతో నిండు నూరేళ్లు సుఖ సంతోషాలతో ఉండాలని దీవెనలు అందించారు ఈ కార్యక్రమంలో పలు టిఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు

# హైదరాబాద్ వేదికగా అంతర్జాతీయ భారత్ సమ్మిట్ -- 2026

- 70 దేశాల ప్రతినిధులు 1,000 మందికి పైగా ప్రముఖులు
- బెక్కెం వేణుగోపాల్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి

**సి కే న్యూస్ కొల్లాపూర్ ప్రతినిధి** కొల్లాపూర్ నియోజక వర్గ పరిధిలోని వెల్లటూరు గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి బెక్కెం వేణుగోపాల్ రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. భారత్ సమ్మిట్ అనేది ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాలకు చెందిన రాజకీయ నాయకులు, ప్రజా ప్రతినిధులు, మేధావులు, ఆర్థిక నిపుణులు, విద్యా వేత్తలు, విధాన నిర్ణేతలు ఒకే వేదికపై సమావేశమై అంతర్జాతీయ సమస్యలు, ప్రజాస్వామ్యం, ఆర్థిక అభివృద్ధి, శాంతి, సామాజిక న్యాయం వంటి అంశాలపై చర్చించే అంతర్జాతీయ సదస్సు. ఈ కార్యక్రమాన్ని తెలంగాణ ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు.

### ఎప్పుడు, ఎక్కడ జరుగుతోంది

తేదీలు: నవంబర్ 13, 14, 2026. వేదిక హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ (హేచ్ఐసీసీ), హైటెక్స్, దేశాలు సుమారు 70 దేశాలు ప్రతినిధులు 1,000 మందికి పైగా. ప్రధాన ఇతివృత్తం (నూతన ప్రపంచ నిర్మాణం) ముఖ్యంగా ఎవరెవరు పాల్గొంటున్నారు. ఈ సదస్సులో పాల్గొంటున్న ప్రముఖులు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీ, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సల్మాన్ ఖుర్షీద్,

శశి థరూర్, వివిధ దేశాలకు చెందిన మంత్రులు, ఎంపీలు, రాజకీయ నాయకులు, అంతర్జాతీయ మేధావులు, రాహుల్ గాంధీ నవంబర్ 14న ముగింపు కార్యక్రమంలో ప్రసంగించ నున్నారు.

### ఈ సమ్మిట్‌లో ప్రధానంగా చర్చించే అంశాలు

ప్రజాస్వామ్య పరిరక్షణ: ప్రపంచ వ్యాప్తంగా ప్రజాస్వామ్య వ్యవస్థలను బలోపేతం చేయడం. ఆర్థిక అభివృద్ధి: పేదరిక నిర్మూలన, ఉపాధి అవకాశాలు, ఆర్థిక సమానత్వం. అంతర్జాతీయ శాంతి: దేశాల మధ్య యుద్ధాలు, ఉద్రిక్తతలు తగ్గించి శాంతియుత సంబంధాలు పెంపొందించడం. సాంకేతిక పరిజ్ఞానం: కృత్రిమ మేధ (ఎ ఐ ), ఆధునిక సాంకేతికత, డిజిటల్ అభివృద్ధి. మహిళా సాధికారత: మహిళలకు సమాన అవకాశాలు, రాజకీయాల్లో మహిళల భాగస్వామ్యం. యువత భవిష్యత్తు: యువతకు ఉపాధి, విద్య, రాజకీయాల్లో భాగస్వామ్యం. వాతావరణ మార్పులు: పర్యావరణ పరిరక్షణ, ప్రకృతి విపత్తులను ఎదుర్కోవడం.







### తెలంగాణ రాష్ట్రానికి ఏ విధంగా ప్రయోజనం

ఈ అంతర్జాతీయ సదస్సు ద్వారా తెలంగాణకు పలు ప్రయోజనాలు కలిగే అవకాశముంది. హైదరాబాద్‌కు అంతర్జాతీయ గుర్తింపు పెరుగుతుంది. విదేశీ పెట్టుబడులను ఆకర్షించడానికి అవకాశం ఉంటుంది. ఐటీ, పరిశ్రమలు, విద్య, వైద్య రంగాలకు అంతర్జాతీయ పరిచయాలు ఏర్పడతాయి. పర్యాటక రంగానికి ప్రోత్సాహం లభిస్తుంది. తెలంగాణ అభివృద్ధి ప్రణాళికలను ప్రపంచ దేశాలకు పరిచయం చేయవచ్చు. భవిష్యత్ సిటీ, పట్టణీకరణ, ఆర్థిక అభివృద్ధిపై అంతర్జాతీయ నిపుణుల అభిప్రాయాలు తెలుసుకోవచ్చు. ఈ సందర్భంగా తెలంగాణ రైజింగ్ పేరుతో ప్రత్యేక చర్చా కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నారు.

### భారత్ సమ్మిట్ నిర్వహించడం వెనుక ప్రధాన ఉద్దేశం ఏమిటి

ప్రపంచ దేశాల మధ్య సహకారాన్ని పెంపొందించడం, ప్రజాస్వామ్య విలువలను కాపాడటం, ఆర్థిక మరియు సామాజిక అసమానతలను తగ్గించడం, శాంతియుత ప్రపంచ వ్యవస్థ నిర్మాణానికి మార్గాలను అన్వేషించడం ఈ సదస్సు ప్రధాన ఉద్దేశాలు. గతంలో కూడా భారత్ సమ్మిట్ జరిగిందా అవును. తొలి భారత్ సమ్మిట్ 2025 ఏప్రిల్ 25, 26 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించారు. ప్రస్తుతం రెండో విడతగా 2026 నవంబర్ 13, 14 తేదీల్లో నిర్వహిస్తున్నారు.

## రైతులను ఆదుకోకపోతే జిల్లా వ్యాప్తంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, కలెక్టరేట్ ముట్టడిస్తాం -- పాశం భాస్కర్

వలిగొండలో బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో రైతు ధర్నా

సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు। నవంబర్ 13








యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ మండల శాఖ అధ్యక్షుడు బోళ్ల సుదర్శన్ ఆధ్వర్యంలో గురువారం రైతుల సమస్యల పరిష్కారం కోసం ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు పాశం భాస్కర్ హాజరయ్యారు.

ఈ సందర్భంగా పాశం భాస్కర్ మాట్లాడుతూ.. మండలానికి ఎమ్మెల్యే ఉన్నప్పటికీ ఇప్పటివరకు ఐకేపీ, పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్లు ప్రారంభించకపోవడం విచారకరమన్నారు. అన్ని కేంద్రాల్లో నామమాత్రంగా కొబ్బరికాయలు కొట్టి, రిబ్బన్లు కట్ చేసి ప్రారంభోత్సవాలు నిర్వహించారే తప్ప ధాన్యం కొనుగోళ్లు మాత్రం చేపట్టలేదని విమర్శించారు.

దీంతో రైతులు తాము కష్టపడి పండించిన ధాన్యాన్ని రైస్ మిల్లర్లు, మధ్య దళారులకు తక్కువ ధరలకు విక్రయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి మండలంలోని అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్లు ప్రారంభించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా రైతులను సమీకరించి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంతో పాటు జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏలే చంద్రశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి కొప్పుల యాదిరెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఫకీర్ రాజేందర్ రెడ్డి, జిల్లా కిసాన్ మోర్చా కార్యదర్శి కందుల తానీషా గౌడ్, జిల్లా నాయకులు బంధారపు లింగస్వామి, ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి మంద నరసింహ ముదిరాజ్, రాచకొండ కృష్ణ, జిల్లా కార్యవర్గ సభ్యులు మైసోల్ల రామనర్స్, కనతాల అశోక్ రెడ్డి, జిల్లా నాయకులు బండారపు రాములు, సీలోజు శ్రీరాములు, బచ్చు శ్రీనివాస్, మైసోల్ల మత్స్యగిరి, ఎలిమినేటి వెంకటేష్, స్థానిక వార్డు సభ్యుడు దంతూరి అరుణ్ గౌడ్, మండల ఉపాధ్యక్షులు అమరేందర్, నాగరాజు, మండల ప్రధాన కార్యదర్శి లోడే లింగస్వామి గౌడ్, మండల కార్యదర్శులు శ్రీనివాస్, మహేష్, బీజేపీ మండల నాయకులు జనార్దన్ రెడ్డి, పద్మారెడ్డి, చిన్న మచ్చ గిరి, రామచంద్రం, వెంకటేష్, లింగస్వామి, శ్రీధర్, కృష్ణ, లక్ష్మయ్య, మురళి, వివిధ గ్రామాల బూత్ అధ్యక్షులు, రైతులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## పార్టీ బలోపేతనానికి ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలి

- ఇచ్చోడ, బజార్‌హత్నూర్ మండలాల్లో బీజేపీ వివిధ మోర్చాల మండల కమిటీల నియామకంపై సమావేశం



సికె.న్యూస్. ఇచ్చోడ:ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మరియు బజార్‌హత్నూర్ మండల కేంద్రాల్లో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో వివిధ మోర్చాల మండల కమిటీల నియామకానికి సంబంధించి సమావేశాలు నిర్వహించారు.ఈ సమావేశాలకు ఆదిలాబాద్ జిల్లా బీజేపీ అధ్యక్షులు శ్రీ పతంగే బ్రహ్మానంద్ గారు హాజరై పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్టీ బలోపేతానికి ప్రతి మోర్చా కీలక పాత్ర పోషించాలని, మండల స్థాయిలో కమిటీలను పటిష్టంగా ఏర్పాటు చేసుకుని ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.బీజేపీ సిద్ధాంతాలు, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, యువత, మహిళలు, రైతులు, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాలను పార్టీ కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి కార్యకర్త బాధ్యతతో పనిచేస్తూ పార్టీ సంస్థాగత బలోపేతానికి కృషి చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరావు అమెటే ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు వీరా దేవన్న బీజేవైఎం జిల్లా అధ్యక్షులు కాళ్ళ సాయి ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి వాగ్మారే శైలేందర్ శైలేందర్ మరియు వివిధ మోర్చాల నాయకులు కార్యకర్తలు మండల అధ్యక్షులు నాయకులు పాల్గొన్నారు.

## పెబ్బేర్ ప్రెస్ క్లబ్ ఆర్థిక సాయం...

- మానవత్వంతో ముందుకొచ్చిన ప్రెస్ క్లబ్ సభ్యులు.. రూ.21 వేల ఆర్థిక సహాయం అందజేత



పెబ్బేరు మున్సిపాలిటీ నవంబర్ /13 ( సి కే న్యూస్ )

తోటి విలేకరి కుటుంబానికి ఆపద సమయంలో అండగా నిలిచి పెబ్బేర్ ప్రెస్ క్లబ్ సభ్యులు మానవత్వాన్ని చాటుకున్నారు.పెబ్బేర్‌కు చెందిన తోటి విలేకరి ఎద్దుల రాములు కుమారుడు ఎద్దుల సాయి వర్ధన్ క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ హైదరాబాద్‌లోని బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న పెబ్బేర్ ప్రెస్ క్లబ్ సభ్యులు స్పందించారు. తోటి జర్నలిస్టు కుటుంబం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో తమ వంతు సహాయం చేయాలనే సంకల్పంతో ప్రెస్ క్లబ్ సభ్యులందరూ కలిసి తమకు తోచినంత విరాళాన్ని అందించారు.ఈ క్రమంలో మొత్తం రూ.21,000 ఆర్థిక సహాయాన్ని సమకూర్చి, ఎద్దుల రాములు ఇంటికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. సాయి వర్ధన్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని, చికిత్సకు అవసరమైన మందుల ఖర్చులు అధికంగా ఉంటున్న నేపథ్యంలో ఈ ఆర్థిక సహాయాన్ని అందజేశారు.ఈ సందర్భంగా ఎద్దుల రాములు మాట్లాడుతూ.. కష్టకాలంలో తోటి విలేకరులు తమ కుటుంబానికి అండగా నిలవడం ఎంతో సంతోషాన్ని, ధైర్యాన్ని ఇచ్చిందని, ఈ సహాయాన్ని ఎప్పటికీ మరువలేనని కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ సభ్యులు మాట్లాడుతూ.. జర్నలిస్టుల కుటుంబాల్లో ఎవరికి ఆపద వచ్చినా ఒకరికొకరు అండగా నిలవడం మనందరి బాధ్యత అని, తోటి జర్నలిస్టు కుటుంబాన్ని ఆదుకోవడం కేవలం సహాయం మాత్రమే కాదని, అది మన మానవత్వానికి నిదర్శనమని పేర్కొన్నారు. సాయి వర్ధన్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ, ఎద్దుల రాములు కుటుంబానికి ధైర్యం చెప్పారు.పెబ్బేర్ ప్రెస్ క్లబ్ కమిటీ సభ్యులు, అయ్యప్ప స్వాముల సమక్షంలో ఈ రూ.21,000 ఆర్థిక సహాయాన్ని ఎద్దుల రాములుకు అందజేశారు.ఆపదలో ఉన్న తోటి జర్నలిస్టుకు అండగా నిలిచిన పెబ్బేర్ ప్రెస్ క్లబ్ సభ్యుల సేవాభావం పలువురి ప్రశంసలు అందుకుంది. ఐకమత్యం, ఆప్యాయత, మానవత్వం కలిస్తే ఆపదలో ఉన్న కుటుంబానికి ఎంతటి ధైర్యాన్నైనా అందించవచ్చని ఈ కార్యక్రమం చాటిచెప్పింది.

## ఆదరణ శివ ఫౌండేషన్



మధిర నవంబర్ 13(సికె న్యూస్)మధిరలో ఇమాంబి మరణ వార్త తెలిసి ఫోన్ల ద్వారా, మెసేజ్ ల ద్వారా ఓదార్చిన ప్రతి ఒక్కరికీ మా కుటుంబం తరపున ప్రత్యేక ధన్యవాదాలు.

ఆమె అందరి ప్రేమను పొంది, అందరితో ప్రేమను పంచుకుని వెళ్ళిపోయింది. ఆమె జ్ఞాపకాలు ఎప్పటికీ మాతోనే ఉంటాయి.

ఆమె పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నాము.
ఆదరణ సేవా ఫౌండేషన్ మధిర 9963115303 రెస్పాన్సిబిల్

## అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు పూర్తిగా రూపుమాపాలి.



సికె.న్యూస్..ఆదిలాబాద్

నేర రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్క పోలీసు అధికారి కృషి చేయాలని, విధుల నిర్వహణ లో జవాబుదారీతనం, నిజాయితీ అలవర్చుకోవాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ తెలిపారు. శుక్రవారం పోలీసు హెడ్ క్వార్టర్స్ సమావేశ మందిరం లో జిల్లా పోలీసు అధికారులచే నెలవారి నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా పూర్తిగా అసాంఘిక కార్యకలాపాలను రూపుమాపే దిశగా పోలీసు విధులను చేపట్టాలని తెలిపారు. పోలీస్ స్టేషన్కు వచ్చే బాధితులను సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా గంజాయి, గుడుంబా, మాదకద్రవ్యాలు, గ్యాంబ్లింగ్, గేమింగ్ లాంటివి జరగకుండా పటిష్ట మైన చర్యలు చేపట్టాలని తెలిపారు. నేరాల నియంత్రణకు, నేర పరిశోధనకు సిసిటివి కెమెరాల పాత్ర కీలకంగా వ్యవహరిస్తుందని ప్రతి గ్రామం నందు ప్రతి పట్టణం నందు సిసిటివి కెమెరాలు ఏర్పాటు చేసే విధంగా ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్రోత్సహించాలని తెలిపారు. సైబర్ క్రైమ్ బాధితులకు తిరిగి డబ్బులు అందే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రజలలో పోలీసుల పట్ల నమ్మకం పెంచే విధంగా విధుల నిర్వహణ జరగాలని, విధులను నీతి నిజాయితీలను తప్పనిసరి కలిగి ఉండాలని తెలిపారు. రౌడీ షీటర్లను మరియు సస్పెక్ట్ షీటర్లను తరచూ తనిఖీ చేస్తూ వారి కదలికలను గమనిస్తూ ఉండాలన్నారు. ముఖ్యంగా

- రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్ల కదలికలపై నిఘా కొనసాగాలి.
- డయల్ 100, బ్లూ కోర్ట్ సిబ్బందిచే గ్రామాలలో విస్తృత అవగాహన కల్పించాలి
- గేమింగ్, మట్కా, గంజాయి, గుడుంబా, మాదకద్రవ్యాలు లాంటి వాటిపై
- సిబ్బంది విధులలో క్రమశిక్షణ, సమయపాలన, నిజాయితీ కలిగి ఉండాలి
- దర్యాప్తునందు నాణ్యత ప్రమాణాలు పాటించాలి.
- జిల్లా పోలీసు అధికారులచే నెలవారి నేర సమీక్ష సమావేశం.
- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్

మహిళల పట్ల జరుగు నేరాలపై ప్రత్యేక శ్రద్ధ వహించి నిందితులకు చట్టపరంగా శిక్షలు పడేవిధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ ఎలాంటి పెండెన్సీ లేకుండా చూడాలన్నారు. పోలీస్ స్టేషన్లో వారిగా నమోదైన కేసుల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, ప్రతి ఒక్క కేసు పై విచారణ జరిపారు. కోర్టు డ్యూటీ అధికారుల తో ప్రతి వారం సమీక్షిస్తూ కోర్టుల నందు శిక్షణ కరిగే విధంగా దర్యాప్తు లో నాణ్యత ప్రమాణాలను పాటించాలని తెలిపారు. కోర్టులలో నందు సరైన శిక్షలు పడినప్పుడు ప్రజలలో పోలీసు పట్ల ఉండే నమ్మకం మరింత పెరుగుతుందని సూచించారు. పోలీస్ స్టేషన్ నందు వివిధ రంగాలలో ప్రతిభగల పరిచిన సిబ్బందికి ప్రశంసా పత్రాలను అందజేసి ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి మౌనిక ఐపీఎస్, ఎఎస్పి రుత్విక్ సాయి కొట్టే ఐపిఎస్, డీఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి, పోలీస్ కార్యాలయం ఏవో శివ కుమార్, జిల్లా వ్యాప్తంగా ఉన్న సర్కిల్ ఇన్స్పెక్టర్లు, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు, ఎస్సైఓలు, ఎస్ఐ లు, ఐటీ కోర్, డి సి ఆర్ బి, పోలీసు కార్యాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## చింతకాని మండలంలో పలు గ్రామాల్లో లింగాల కమల్ రాజు పర్యటన

అనారోగ్యంతో బాధపడుతున్న వారికి పరామర్శ.. మృతుల కుటుంబాలకు సానుభూతి

సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి. చింతకాని, నవంబర్ 13:

ఖమ్మం జిల్లా మాజీ జడ్పీ చైర్మన్, మధిర నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి లింగాల కమల్ రాజు శుక్రవారం చింతకాని మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో పాల్గొనడంతో పాటు అనారోగ్యంతో బాధపడుతున్న వారిని పరామర్శించి, మృతుల కుటుంబాలను ఓదార్చారు.

ముందుగా ప్రొద్దుటూరు గ్రామంలో నిర్వహించిన అయ్యప్ప స్వాముల భిక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం కోమట్లగూడెం గ్రామంలో ఇటీవల అనారోగ్యానికి గురైన మాజీ సర్పంచ్ వేముల నర్సయ్య, సత్యనారాయణరెడ్డిలను పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

అనంతరం బస్వాపురం గ్రామంలో ఇటీవల మరణించిన దొడ్డ బసవయ్య, మాజీ సర్పంచ్ ఆవుల ఆదెమ్మ, వరికూటి నరసింహారావు, చంద్రకాని గోవిందరావుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

పందిళ్లపల్లి గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న లింగం శ్రీనివాసరావు, వత్సవాయి నాగలక్ష్మిలను పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు.

ఈ పర్యటనలో చింతకాని మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు మంకెన రమేష్, బొడ్డు వెంకట రామారావు, వంకాయలపాటి వెంకట లచ్చయ్య, గురజాల




హనుమంతరావు, గడ్డం శ్రీను, బండి రామారావు, సర్పంచులు కొండూరి పరిశుద్ధరావు, చాపలమడుగు వీరబాబు, కోపూరి నవీన్, నాదెండ్ల వెంకటేష్, మాజీ సర్పంచ్ కాలింగ డేవిడ్, తునికిపాటి పూర్ణచంద్రరావు, ఉపసర్పంచ్ ప్రసాదు, ప్రొద్దుటూరు పాపినేని రంగారావు, నల్లమోతు రాంబాబు, బత్తుల వెంకటేశ్వర్లు, పల్లపు అంకాలు, మాజీ సర్పంచ్ సోమ నాగేశ్వరరావు, అంబటి వెంకటి తదితర గ్రామాల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆపదలో అండగా... సహాయోగ్ ఫౌండేషన్



సికె న్యూస్ నవంబర్ 13 మహబూబాబాద్ జిల్లా (పతినిధి :మురళి కొత్తగూడ మండలం లోని దుర్గారం గ్రామపంచాయతీ పరిధిలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన పత్తిపాక వెంకన్న చారి గారు నిరుపేద కుటుంబానికి చెందిన వ్యక్తి రెక్కాడితే గానీ డొక్కాడని పరిస్థితుల్లో ఆటో నడుపుతూ, వడ్రంగి పనులు చేస్తూ, చెట్లు కొట్టే పనులు చేసుకుంటూ తన కుటుంబాన్ని పోషించుకుంటున్నారు.

ఈ క్రమంలో పొగుళ్లపల్లి గ్రామంలో చెట్లు కొట్టడానికి వెళ్లిన సమయంలో దురదృష్టవశాత్తు ప్రమాదం జరిగి ఆయన ఎడమ చేయి పూర్తిగా తెగిపోయింది. దీంతో ఆయన కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో పడింది.

ఈ విషయం తెలుసుకున్న సహాయోగ్ ఫౌండేషన్ సభ్యులు ఆయన కుటుంబ పరిస్థితిని అడిగి తెలుసుకుని, కుటుంబానికి అండగా నిలుస్తూ రూ. 5,000 ఆర్థిక సహాయం అందించడం జరిగింది.ఈ కార్యక్రమంలో సహాయోగ్ ఫౌండేషన్ సభ్యులు నన్నుబోతుల లింగన్న యాదవ్, బండి రంజిత్ యాదవ్, పుల్సాం నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఆదరణ శివ ఫౌండేషన్



మధిర నవంబర్ 13(సికె న్యూస్)మధిరలో ఇమాంబి మరణ వార్త తెలిసి ఫోన్ల ద్వారా, మెసేజ్ ల ద్వారా ఓదార్చిన ప్రతి ఒక్కరికీ మా కుటుంబం తరపున ప్రత్యేక ధన్యవాదాలు.

ఆమె అందరి ప్రేమను పొంది, అందరితో ప్రేమను పంచుకుని వెళ్ళిపోయింది. ఆమె జ్ఞాపకాలు ఎప్పటికీ మాతోనే ఉంటాయి.

ఆమె పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నాము.
ఆదరణ సేవా ఫౌండేషన్ మధిర 9963115303 రెస్పాన్సిబిల్

## మధిర మున్సిపాలిటీలో రూ.4 లక్షల డస్ట్ కుంభకోణం?

**మొదట రూ.5 లక్షలు.. ఇప్పుడు రూ.4 లక్షలకు తీర్మానం!**
**మట్టి ఎక్కడ పోశారు? కాంట్రాక్టర్ ఎవరు? ప్రజాధనం ఎవరి జేబులోకి?**



**మధిర నవంబర్ 13(సికె న్యూస్)**మధిర మున్సిపాలిటీలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనుల పేరుతో ప్రజాధనం దుర్వినియోగం అవుతోందా? డస్ట్ తొలగింపు, మట్టి తరలింపు పేరుతో చూపిస్తున్న బిల్లుల వెనుక అసలు కథ ఏమిటి?

తొలుత రూ.5 లక్షల బిల్లు ప్రతిపాదించి, ఇప్పుడు రూ.4 లక్షలకు కౌన్సిల్‌లో తీర్మానం తీసుకురావడం అనేక అనుమానాలకు తావిస్తోంది.

మొదట రూ.5 లక్షలు.. ఇప్పుడు రూ.4 లక్షలు.. ఈ రూ.1 లక్ష తగ్గింపు వెనుక అసలు కారణం ఏమిటి?మున్సిపల్ ఎన్నికల సమయంలో సంబంధిత వార్డుల్లో కనీసం రెండు ట్రాక్టర్ ట్రక్కుల మట్టి కూడా తరలించలేదని 19వ వార్డు కౌన్సిలర్ వై.వి. వెంకట అప్పారావు ప్రశ్నించారు.

**రూ.4 లక్షల మట్టి అసలు ఎక్కడ పోశారు?**

ప్రజలకు, అధికారులకు కొన్ని సూటి ప్రశ్నలు:

1. రూ.4 లక్షల విలువైన మట్టిని అసలు ఏ ప్రాంతంలో పోశారు?
2. ఏయే వార్డుల్లో ఎంత మట్టి ఉపయోగించారు?
3. వార్డులకు కనీసం రెండు ట్రాక్టర్ ట్రక్కుల మట్టి కూడా వెళ్లనప్పుడు రూ.4 లక్షల బిల్లు ఎలా వచ్చింది?
4. ఎన్ని ట్రాక్టర్లు మట్టి తరలించాయి? వాటి రికార్డులు ఎక్కడ?
5. ఈ పనికి సంబంధించిన కాంట్రాక్టర్ ఎవరు? ఆయన పేరు, సంస్థ వివరాలు బయటపెట్టగలరా?
6. వర్క్ ఆర్డర్, బిల్లులు, మెజర్‌మెంట్ బుక్ (వీడీ), పనికి సంబంధించిన ఫొటోలు ఎక్కడ ఉన్నాయి?
7. మొదట రూ.5 లక్షల ప్రతిపాదనను ఇప్పుడు రూ.4 లక్షలకు ఎందుకు మార్చారు?
8. గతంలో అదనపు కలెక్టర్ శ్రీజ గారు ప్రతిపాదనను తిరస్కరించినట్లు వెల్లడైనప్పటికీ, మళ్లీ తీర్మానంలోకి ఎందుకు తీసుకొచ్చారు?

**గతంలో తిరస్కరణ.. ఇప్పుడు మళ్లీ తీర్మానం!**

ఈ ప్రతిపాదనపై గతంలో అదనపు కలెక్టర్ శ్రీజ సందేహాలు వ్యక్తం చేసి తిరస్కరించినట్లు కౌన్సిలర్ వెల్లడించారు. అయినప్పటికీ స్థానిక కాంగ్రెస్ నాయకుల ఒత్తిడితో మళ్లీ కౌన్సిల్ తీర్మానంలోకి తీసుకొచ్చారని ఆయన ఆరోపించారు. దీనిపై అధికారులు వాస్తవాలు వెల్లడించాలి.

**కుంభకోణం జరిగిందా? విచారణ జరిపించండి!**

పని చేయకుండానే బిల్లులు సృష్టించారా? చేసిన పనికంటే ఎక్కువ మొత్తాన్ని చూపించారా? కాగితాలపై లెక్కలు ఒకలా, క్షేత్రస్థాయిలో పరిస్థితి మరోలా ఉందా?

ఈ అనుమానాలన్నింటికీ సమాధానం రావాలంటే సమగ్ర విచారణ జరగాలి.

మా డిమాండ్లు:లి

– రూ.5 లక్షల నుంచి రూ.4 లక్షలకు బిల్లు మారిన కారణం వెల్లడించాలి.
– సంబంధిత కాంట్రాక్టర్ పూర్తి వివరాలు బయటపెట్టాలి.
– వార్డులవారీగా మట్టి తరలింపు వివరాలు ప్రకటించాలి.
– వర్క్ ఆర్డర్, వీడీ, బిల్లులు ప్రజలకు అందుబాటులో ఉంచాలి.
– స్వతంత్ర అధికారులతో క్షేత్రస్థాయి విచారణ జరిపించాలి.

ప్రజాధనం దోచుకునే హక్కు ఎవరికీ లేదు!లి

రూ.4 లక్షల మట్టి ఎక్కడ పోశారు? కాంట్రాక్టర్ ఎవరు? పని చేసిన ఆధారాలు ఏమిటి?లి మీడియా సాక్షిగా మున్సిపల్ అధికారులను ప్రశ్నిస్తున్నాం. ఆధారాలతో సమాధానం చెప్పండి. ప్రజల సొమ్ముకు లెక్క చూపించండి.

ప్రజాధనం ప్రజల కోసమే ఖర్చు కావాలి.. ఎవరి ప్రయోజనాల కోసమో కాదు!లివై.వి. వెంకట అప్పారావు
19వ వార్డు కౌన్సిలర్, మధిర మున్సిపాలిటీ

## అన్న ప్రసన్న వేడుకల్లో పాల్గొని చిన్నారిని ఆశీర్వదించిన గ్రామ సర్పంచ్ మొగిలి కృష్ణయ్య

**మాజీ సర్పంచ్ పుల్లయ్య**



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.**ప్రొద్దుటూరు గ్రామస్తులు బత్తుల రామనర్సయ్య (జగన్) స్వరూప (బత్తుల భాను రమ్య ల ముద్దుల కుమారుడు) ల ముద్దుల మనవడు చి:: అయాన్ :: అన్నప్రాసన వేడుకకు హాజరై చిరంజీవిని ఆశీర్వదించిన ప్రొద్దుటూరు గ్రామ సర్పంచ్ మొగిలి కృష్ణయ్య మాజీ సర్పంచ్ పెంట్యాల పుల్లయ్య స్వామి మాజీ ఎంపీటీసీ సభ్యురాలు చల్లా పుష్పావతి గ్రామస్తులు చల్లా శంభు లింగం బత్తుల వెంకయ్య చల్లా వెంకటరామారావు తదితరులు పాల్గొన్నారు

## జవహర్ నగర్ డంపింగ్ యార్డు ఎత్తివేత కోసం నవంబర్-15న రిలే నిరసన దీక్షలు

**జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ ఎత్తివేత పోరాట కమిటీ చైర్మన్ షేక్ షావలి**

**సికే న్యూస్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ రంజిత్** : జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ ఎత్తివేతకు మద్దతు ఇవ్వాలని ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, తనయుడు మహేందర్ రెడ్డి గార్లకు వినతిపత్రాలు ఎం.పి. ఈటెల రాజేందర్, అధికార కాంగ్రెస్ పార్టీ డిసిసి అధ్యక్షులు వజ్రేష్ యాదవ్ గార్ల మద్దతు కొరకు త్వరలో వినతిపత్రాలు.అందజేయనున్నామని వెల్లడి జేఏసి కమిటీలో కో-కన్వీనర్ గా బీఆర్ఎస్ మేడ్చల్ నియోజకవర్గ పార్టీ ఇంచార్జ్ మహేందర్ రెడ్డి జవహర్ నగర్ డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాట కమిటీ చైర్మన్ షేక్ షావలి జవహర్ నగర్ డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాట కమిటీ (జేఏసి) ఆధ్వర్యంలో నవంబర్-15 నుంచి చేపట్టనున్న రిలే నిరసన దీక్షలకు మద్దతుగా నిలబడాలని కోరుతూ, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, తనయుడు మహేందర్ రెడ్డి గార్లకు శుక్రవారం రోజువినతిపత్రాలు సమర్పించడం జరిగిందని జేఏసి చైర్మన్ షేక్ షావలి తెలియజేశారు. జవహర్ నగర్ డంపింగ్ యార్డు వల్ల జవహర్ నగర్, దమ్మాయిగూడ, కాప్రా, కీసర, శామీర్ పేట, ఘట్ కేసర్, యాప్రాల్, చెంగిచర్ల తదితర మేడ్చల్ నియోజకవర్గ ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం ఒక ప్రజాప్రతినిధిగా మల్లారెడ్డి గారికి తెలుసని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న ప్రకటనలు, ఇచ్చిన హామీల పట్ల ప్రజలు విశ్వాసాన్ని కోల్పోయారని అన్నారు. డంపింగ్ యార్డు నుంచి వస్తున్న భరించలేని దుర్వాసన వల్ల రోజుకు ఇద్దరు లేదా ముగ్గురు చనిపోతున్నారని గుర్తుచేశారు. భూగర్భ జలాలు కలుషితం కావడం, తాగునీరు పనికిరాకుండా పోవడంతో ప్రజలు ఆరోగ్యపరంగా పలు శారీరక, మానసిక బాధలకు గురవుతున్నారని పేర్కొన్నారు. దోమలు, ఈగలు పెరిగి డెంగ్యూ, మలేరియా, చర్మ వ్యాధులు ప్రబలడంతో పిల్లలు, వృద్ధులు, గర్భిణీ స్త్రీలు శ్వాస సంబంధిత వ్యాధులకు గురై తీవ్ర మనోవేదనతో తల్లడిల్లుతున్నారని అన్నారు. చెరువులు, కుంటలు విషంగా మారి, రైతుల పంటలు, పాడి పశువులు నష్టపోవడం, మత్స్యకారులు ఇబ్బంది పడడం జరుగుతున్నదని తెలియజేశారు. ఏళ్ల తరబడి ప్రజలు విన్నవించుకున్నా, డంపింగ్ యార్డును ఎత్తివేయడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని, ఎవరికి వారు తమదైన రాజకీయ కార్యక్రమాలతో సాగదీత ధోరణి అవలంబిస్తుండటం పట్ల ప్రజల్లో తీవ్ర అసంతృప్తి, వ్యతిరేకత పెరిగిందని అన్నారు. అందుకే సహనం కోల్పోయిన ప్రజలు, జేఏసి ఆధ్వర్యంలో నవంబర్-15 నుంచి రిలే నిరసన దీక్షలు చేపట్టాలని నిర్ణయించారని పేర్కొన్నారు. అందుకే ముందుగా మేడ్చల్ ఎమ్మెల్యే గారిని కలిసి, ఈ ఉద్యమానికి అండగా నిలబడాలని, శాసనసభలో ఈ సమస్యను బీఆర్ఎస్ ఎమ్మెల్యేలందరితో కలిసి లేవనెత్తి, డంపింగ్ యార్డును శాశ్వతంగా ఎత్తివేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరడం జరిగిందని గుర్తుచేశారు. ప్రజల ఆరోగ్యం కంటే డంపింగ్ యార్డు ముఖ్యం కాదని, పార్టీలు, పదవులను పణంగా పెట్టి ప్రజల ప్రాణాలను, పర్యావరణాన్ని కాపాడాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ఎం.పి. ఈటెల రాజేందర్, అధికార కాంగ్రెస్ పార్టీ డిసిసి అధ్యక్షులు వజ్రేష్ యాదవ్ గార్లకు కూడా సమస్య పరిష్కారానికి త్వరలో మెమోరాండంలు సమర్పించి, రిలే దీక్షలకు మద్దతు కోరనున్నామని వెల్లడించారు. దమ్మాయిగూడ జేఏసితో పాటు నాలుగు మండలాల బాధిత ప్రాంతాల ప్రజలు రిలే నిరసన దీక్షలలో భాగస్వామ్యం వహించి, యార్డును సంపూర్ణంగా తొలగించేంత వరకు జరిగే పోరాటానికి తమ సంపూర్ణమైన నైతిక మద్దతును అందించాలని కోరారు. పదవి ముఖ్యం కాదు, ప్రజల ప్రాణాలు ముఖ్యమని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సమస్య పరిష్కారానికి చొరవ చూపకపోతే రాజీనామా చేసి, జేఏసికి అండగా నిలబడి ఉద్యమిస్తామని ఈ సందర్భంగా స్పష్టం చేసిన మల్లారెడ్డి గారికి మరియు
జేఏసి విన్నపాన్ని అంగీకరించి, డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాట కమిటీలో కో-కన్వీనర్ గా కొనసాగడానికి అంగీకరించిన మేడ్చల్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ మహేందర్ రెడ్డికి ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో జేఏసి కోశాధికారి, ఐ.ఎఫ్.టి.యు. శివబాబు, కో-కన్వీనర్లు బీఆర్ఎస్ ఆలూరి రాజశేఖర్, ఎక్స్ కార్పొరేటర్ పల్లపు రవి, టి.యు.సి.ఐ. వి. ప్రవీణ్, పి.కె.ఎం. డి. జాన్, ఏ.ఐ.ఎఫ్.టి.యు. వై. మల్లేష్, సి.ఎం.ఎస్. జయ తదితరులు పాల్గొన్నారు.



## సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తతో వ్యవహరించాలి



- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్
- వారం రోజుల్లో జిల్లాలో 24 సైబర్ ఫిర్యాదులు
- ఆన్‌లైన్ షాపింగ్, లోన్ ఫ్రాడ్, ఉద్యోగాల పేరుతో మోసాల పట్ల జాగ్రత్త
- యూపీఐ లావాదేవీలు, మొబైల్ హ్యాకింగ్, సోషల్ మీడియా ఖాతాల హ్యాకింగ్ పట్ల అప్రమత్తంగా ఉండాలి
- సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలి

**సికె.న్యూస్...ఆదిలాబాద్** జిల్లాలో మొత్తం 24 సైబర్ నేరాలకు సంబంధించిన ఫిర్యాదులు నమోదైనట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ తెలిపారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో ఆన్‌లైన్ లావాదేవీలు పెరుగుతున్న నేపథ్యంలో సైబర్ నేరగాళ్లు వివిధ పద్ధతుల్లో ప్రజలను మోసం చేస్తున్నారని, ప్రతి ఒక్కరూ సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

**వారం రోజుల్లో నమోదైన సైబర్ మోసాల ఉదాహరణలు**

1. మొబైల్ హ్యాకింగ్ ద్వారా నగదు స్వాహా: బాధితుడి మొబైల్ ఫోన్ పనిచేయకుండా చేసి, ఇతర పరికరం ద్వారా బ్యాంకు ఖాతాలో పరిశీలించగా రూ.21,000 నగదు మాయమైన ఘటన ఉట్నూర్ పరిధిలో నమోదైంది.
2. ఆన్‌లైన్ షాపింగ్ మోసం: వాట్సాప్ ద్వారా జీపీయూ కొనుగోలు పేరుతో రెండు విడతల్లో రూ.3,500 చెల్లింపులు చేయించుకొని వస్తువు పంపకుండా బాధితుడిని మోసం చేసిన ఘటన ఆదిలాబాద్ రూరల్ పరిధిలో నమోదైంది.
3. లోన్ ఫ్రాడ్: ముద్ర లోన్ ఇప్పిస్తామని నమ్మించి మొదటి ఈఎంఐ పేరుతో రూ.8,975 వసూలు చేసి, మరో రూ.12,500 చెల్లించాలని డిమాండ్ చేసిన ఘటన ఉట్నూర్ పరిధిలో నమోదైంది.
4. మ్యాట్రిమోనీ మోసం: లండన్ నుంచి నగలు, బహుమతులు పంపిస్తున్నామని నమ్మించి పార్సల్ ఛార్జీలు, కరెన్సీ కన్వర్షన్ పేరుతో రూ.1,11,200 వసూలు చేసిన ఘటన ఆదిలాబాద్ వన్ టౌన్ పరిధిలో నమోదైంది.
5. ఆన్‌లైన్ టాస్క్, కమిషన్ మోసం: ఆన్‌లైన్ ఆర్డర్లు పూర్తి చేస్తే కమిషన్ వస్తుందని నమ్మించి పలు లావాదేవీల ద్వారా రూ.2,006 చెల్లింపులు చేయించి, తదుపరి మరిన్ని డబ్బులు చెల్లించాలని ఒత్తిడి చేసిన ఘటన తలమడుగు పరిధిలో నమోదైంది.
6. ఇన్‌స్టాగ్రామ్ ద్వారా వేధింపులు: ఇన్‌స్టాగ్రామ్‌లో అసభ్యకరమైన సందేశాలు పంపుతూ బెదిరింపులకు పాల్పడిన ఘటన ఉట్నూర్ పరిధిలో నమోదైంది.

**సైబర్ నేరాల పట్ల అప్రమత్తత అవసరం**

గుర్తుతెలియని వ్యక్తులు పంపే లింకులను క్లిక్ చేయవద్దని, అనుమానాస్పద యాప్‌లను ఇన్‌స్టాల్ చేయవద్దని జిల్లా ఎస్పీ సూచించారు. బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీ, యూపీఐ పిన్ వంటి వివరాలను ఎవరికీ వెల్లడించవద్దని తెలిపారు. ఆన్‌లైన్‌లో వస్తువులు కొనుగోలు చేసేటప్పుడు విక్రేత వివరాలు పరిశీలించి మాత్రమే చెల్లింపులు చేయాలని సూచించారు.

సైబర్ నేరానికి గురైన బాధితులు ఆలస్యం చేయకుండా వెంటనే జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని జిల్లా ఎస్పీ సూచించారు. అలాగే ఎఽఽ.ఎఎవతీఽతీఱఅవ.స్ర్తశీఱ.అఅ వెబ్‌సైట్ ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. మోసానికి సంబంధించిన ఫోన్ నంబర్లు, మెసేజ్‌లు, లావాదేవీల వివరాలు, స్క్రీన్‌షాట్‌లు వంటి ఆధారాలను భద్రపరచుకోవాలని సూచించారు.ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండటంతో పాటు ఇతరులకు కూడా అవగాహన కల్పించాలని, సైబర్ నేరాల నివారణకు పోలీసులకు సహకరించాలని కోరారు.

## మధిర మండలం వీ=వా ఆఫీస్ లో కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ



**మధిర నవంబర్ 13(సికె న్యూస్)**మధిర మండల వీ=వా ఆఫీస్ లో నిదానపురం, సిరిపురం గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులను అందించడం జరిగింది.ఈ కార్యక్రమంలో కిసాన్ సెల్ అధ్యక్షులు దుంప వెంకటేశ్వర్లరెడ్డిలి, నిదానపురం గ్రామ సర్పంచ్ వెంపటి రత్నకుమారిలి, షేక్ జాకీర్ హుస్సేన్, రమేష్, అప్పారావులి తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీకి సైదయ్య సేవలు చిరస్మరణీయం.తెలుగుదేశం పార్టీ జిల్లా కన్వీనర్ వాసిరెడ్డి రామనాథం




**మధిర నవంబర్ 13(సికె న్యూస్)**బోనకల్ మండల పరిధిలోని రావినూతల గ్రామానికి చెందిన కొమ్మినేని సత్యనారాయణ (చిన్నబ్బాయి ) అన్నగారైన,తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు కొమ్మినేని సైదయ్య (86) గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న టీడీపీ ఖమ్మం పార్లమెంటరీ కన్వీనర్ డాక్టర్ వాసిరెడ్డి రామనాథం స్థానిక పార్టీ నాయకులతో కలిసి ఆయన పార్థివదేహాన్ని సందర్శించి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఈ సందర్భంగా రామనాథం మాట్లాడుతూ.. కొమ్మినేని సైదయ్య మృతి పార్టీకి తీరని లోటని, తెలుగుదేశం పార్టీకి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. పార్టీ అభివృద్ధికి ఆయన అందించిన సహకారం ఎప్పటికీ మరువలేనిదని అన్నారు.

ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రావుల్ల సత్యనారాయణ, జిల్లా నాయకులు సాధినేని హనుమంతరావు, మండల నాయకులు రావూరి మంగయ్య, మామిళ్ల నరసింహారావు, బండి రామారావు, దుగ్గి భద్రయ్య, బంధం రంగయ్య ఆలేటి చంద్రయ్య, పర్సనబోయిన వీరన్న, చితిరాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

## లారీ డ్రైవర్ నిర్లక్ష్యం.. ఘోర రోడ్డు ప్రమాదంలో డీసీఎం డ్రైవర్ మృతి




**షాద్ నగర్ నియోజకవర్గ కొత్తూరు సికె న్యూస్ ప్రతినిధి నవంబర్ 13 :** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గం కొత్తూరు మండలం పరిధిలోని తిమ్మాపూర్ చౌరస్తా వద్ద జాతీయ రహదారి (ఎన-44) పై కొత్తూరు మండలం తిమ్మాపూర్ ఎక్స్ రోడ్ వద్ద గురువారం అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. బెంగళూరులోని హోండా షోరూం నుంచి స్పేర్ పార్ట్స్ లోడ్ చేసుకుని డీసీఎంలో వస్తున్న దీపక్ కుమార్ సోనీ (24) లారీ ఢీకొనడంతో ప్రాణం కోల్పోయాడు.ముందు వెళ్తున్న లారీ డ్రైవర్ కొప్పులవెంకటయ్య ఎలాంటి ఇండికేటర్ ఇవ్వకుండా, ట్రాఫిక్,నిబంధనలు,పాటించకుండా అకస్మాత్తుగా బ్రేకులు వేసి యూ-టర్న్ తీసుకున్నాడు. దీంతో వేగంగా వస్తున్న డీసీఎం లారీని వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డీసీఎం డ్రైవర్ దీపక్ కుమార్ ముఖానికి తీవ్ర గాయాలై సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు.సమాచారం అందుకున్న కొత్తూరు పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. లారీ డ్రైవర్ నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమని గుర్తించి అతనిపై కేసు నమోదు చేశారు. జాతీయ రహదారులపై ప్రయాణించే డ్రైవర్లు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, అతివేగానికి దూరంగా ఉండాలని కొత్తూరు ఇన్‌స్పెక్టర్ బి. నాగార్జున రెడ్డి సూచించారు.

# లికొత్తూరును మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతాం: ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

- కొత్తూరు మున్సిపాలిటీలో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలులి
- కొత్తూరు మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జాండగూడెం సుదర్శన్ గౌడ్ ఆధ్వర్యంలో




షాద్ నగర్ నియోజకవర్గం కొత్తూరు సి కె న్యూస్ ప్రతినిధి సెప్టెంబర్ 13:కొత్తూరు మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యమని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. కొత్తూరు, షాద్‌నగర్ మున్సిపాలిటీల సమగ్రాభివృద్ధి కోసం సుమారు రూ.100 కోట్ల ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు.

కొత్తూరు మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జాండగూడెం సుదర్శన్ గౌడ్ ఆధ్వర్యంలో మున్సిపల్ పరిధిలో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కుమ్మరిగూడలో స్త్రీశక్తి భవన నిర్మాణానికి భూమిపూజ నిర్వహించడంతో పాటు ఇందిరమ్మ ఇళ్లు, కొత్తూర్ మున్సిపాలిటీ పరిధిలో శ్రీరామ్ నగర్ కాలనీలో నూతనంగా నిర్మించిన పార్కు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారులకు చేయూత పింఛన్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేస్తోందన్నారు. పట్టణ అభివృద్ధి నిధులు రూ.80 లక్షలతో ప్లే గ్రౌండ్,ఏర్పాటుచేయడం,అభినందనీయమని పేర్కొన్నారు. కొత్తూరులో ఇప్పటికే 35 ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలు పూర్తయ్యాయని, కొత్తూరు తండాలో రూ.1.20 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు.

ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు,అందేలా,చర్యలు,తీసుకుంటున్నామని తెలిపారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్ల సమస్యల పరిష్కారానికి,ప్రాధాన్యత,ఇస్తున్నామన్నారు. కుటుంబ పెద్దను కోల్పోయిన కుటుంబాలకు,ఆర్థికభరోసా,కల్పించేందుకు రూ.5 లక్షల ఇందిరమ్మ కుటుంబ బీమా పథకాన్ని అమలు చేయనున్నట్లు వెల్లడించారు.పార్టీలకు అతీతంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని, ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహించకుండా బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజల సమష్టి సహకారంతో కొత్తూరును మోడల్ మున్సిపాలిటీగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఎల్లారం శేఖర్ రెడ్డి, సీనియర్ నాయకులు వీరమోని దేవేందర్ ముదిరాజ్ కొత్తూరు మాజీ ఎంపీపీ వేణుగోపాల్ గౌడ్ గోవర్ధన్ గౌడ్ మాజీ సర్పంచ్ జనగా జగన్ మున్సిపల్ ప్రజాప్రతినిధులు, వివిధ గ్రామాల సర్పంచులు వార్డ్ మెంబర్లు కాంగ్రెస్ నాయకులు కాంగ్రెస్ పార్టీ విలేజ్ ప్రెసిడెంట్లు ,మహిళా సంఘాల సభ్యులు, అధికారులు, పోలీస్ శాఖ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## మహిళా ప్రయాణికులకు టీజీఎస్ ఆర్టీసీ గుడ్‌న్యూస్..




షాద్ నగర్ నియోజకవర్గం కొత్తూరు సీకే న్యూస్ ప్రతినిధి నవంబర్ 13:

తెలంగాణ,మహిళా,ప్రయాణికులకు టీజీఎస్ ఆర్టీసీ గొప్ప శుభవార్త అందించింది. ఇప్పటికే 'మహాలక్ష్మి' పథకం కింద పల్లెవెలుగు, ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తున్న సంస్థ.. తాజాగా ఏసీ బస్సుల్లోనూ రాయితీ ప్రకటించింది. మంత్లీ బస్ పాస్ తీసుకునే మహిళలు ఇకపై 15 రోజుల ఛార్జీ చెల్లిస్తే.. నెలరోజుల పాటు ఏసీ బస్సుల్లో ప్రయాణించే అవకాశం కల్పించింది. దీంతో ఏసీ బస్సుల్లో ప్రయాణించాలనుకునే మహిళలకు ఆర్థిక భారం తగ్గనుంది. సాధారణ బస్సులతో పాటు ఏసీ సర్వీసుల్లోనూ రాయితీ అందుబాటులోకి రావడంతో మహిళా ప్రయాణికులకు మరింత వెసులుబాటు కలగనుంది. రోజూ ఉద్యోగాలు, వ్యాపారాలు, ఇతర అవసరాల కోసం ప్రయాణించే మహిళలకు ఈ నిర్ణయం ప్రయోజనకరంగా ఉండనుంది.మరోవైపు.. బస్ పాస్ వినియోగదారులను ప్రోత్సహించేందుకు టీజీఎస్ ఆర్టీసీ మరిన్ని ప్రయోజనాలను ప్రకటించింది. మొత్తం 9 రకాల రాయితీలను అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు వెల్లడించింది. ప్రయాణికులకు అందుబాటు ధరల్లో మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడంతో పాటు బస్ పాస్‌ల వినియోగాన్ని పెంచడమే ఈ నిర్ణయాల వెనుక ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోంది. ఇప్పటికే మహిళలకు ఉచిత ప్రయాణం ద్వారా ఆదరణ పొందుతున్న ఆర్టీసీ.. తాజాగా ఏసీ బస్సుల్లో రాయితీలు, ఇతర పాస్ సదుపాయాలతో మరింత మందికి చేరువయ్యే ప్రయత్నం చేస్తోంది. ప్రకటించిన కొత్త ఆఫర్లు శనివారం నుంచి అమల్లోకి వస్తాయని సంస్థ స్పష్టం చేసింది.

# మధిర మున్సిపాలిటీలో గాడి తప్పిన పాలన!

- నాలుగు నెలల్లో రూ.20 లక్షల డీజిల్, పెట్రోల్ ఖర్చులపై అనుమానాలు
- మున్సిపాలిటీలో ఫ్రైవేటు వ్యక్తుల పెత్తనం ఏమిటి?
- డివైడర్ల మొక్కల కత్తిరింపు, పారిశుద్ధ్య పనుల ఖర్చులపై కౌన్సిలర్ల నిలదీత
- స్టాండింగ్ కమిటీలు ఏర్పాటు చేయాలని సభ్యుల డిమాండ్..




మధిర నవంబర్ 13(సికె న్యూస్)మధిర మున్సిపాలిటీలో పాలన వ్యవహారాలు రోజురోజుకూ చర్చనీయాంశంగా మారుతున్నాయి. ప్రజా సమస్యల పరిష్కారం, పట్టణ అభివృద్ధి పనులపై చర్చించాల్సిన మున్సిపల్ సర్వసభ్య సమావేశం అధికారుల పనితీరు, ఖర్చుల లెక్కలు, ప్రైవేటు వ్యక్తుల ప్రమేయం వంటి అంశాలపై వాడీవేడిగా సాగింది. ముఖ్యంగా మున్సిపాలిటీలో జరుగుతున్న ఆర్థిక లావాదేవీలు, నిర్వహణ వ్యవహారాలపై పలువురు కౌన్సిలర్లు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేశారు.

నాలుగు నెలల్లో రూ.20 లక్షల డీజిల్, పెట్రోల్ ఖర్చా?

మధిర మున్సిపాలిటీలో గత నాలుగు నెలల కాలంలోనే సుమారు రూ.20 లక్షల మేర డీజిల్, పెట్రోల్ ఖర్చు జరిగినట్లు సభ్యులు ఆరోపించడం సమావేశంలో తీవ్ర చర్చకు దారితీసింది. ఇంత భారీ మొత్తంలో ఇంధనం ఎక్కడ వినియోగించారు? ఏ వాహనాలకు ఎంత మేర ఖర్చు చేశారు? ఇందుకు సంబంధించిన బిల్లులు, రికార్డులు పారదర్శకంగా ఉన్నాయా? అంటూ కౌన్సిలర్లు ప్రశ్నలు సంధించారు. డీజిల్, పెట్రోల్ కూపన్ల వ్యవహారంలో ప్రైవేటు వ్యక్తుల ప్రమేయం ఏమిటని, కూపన్లు పక్కదారి పడుతున్నాయనే ఆరోపణలపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

మున్సిపాలిటీలో ప్రైవేటు వ్యక్తుల పెత్తనం ఎందుకు?

మున్సిపల్ సిబ్బంది కమిషనర్ ఆధ్వర్యంలోనే పనిచేయాల్సి ఉండగా, మధ్యలో ప్రైవేటు వ్యక్తుల జోక్యం ఎందుకు ఉంటోందని సభ్యులు ప్రశ్నించారు. మున్సిపల్ పరిపాలనకు సంబంధం లేని వ్యక్తులకు కీలక వ్యవహారాల్లో ప్రాధాన్యత కల్పించడంపై అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. అసలు మున్సిపాలిటీని నడిపిస్తున్నది అధికారులా? లేక ప్రైవేటు వ్యక్తులా? అనే ప్రశ్నలు సమావేశంలో వినిపించాయి. ఈ వ్యవహారంపై కమిషనర్ స్పష్టమైన సమాధానం ఇవ్వాలని సభ్యులు కోరారు.

మొక్కల కత్తిరింపునకు, పారిశుద్ధ్యానికి భారీ ఖర్చులా?

పట్టణంలోని డివైడర్లపై ఉన్న మొక్కల కత్తిరింపు, పారిశుద్ధ్య నిర్వహణ పనులకు భారీ మొత్తంలో నిధులు ఖర్చు చేస్తున్నట్లు చూపడంపై కౌన్సిలర్లు ప్రశ్నలు లేవనెత్తారు. వాస్తవంగా జరిగిన పనులకు, ఖర్చు చేసిన నిధులకు పొంతన ఉందా? పనుల నాణ్యతను పరిశీలిస్తున్నారా? బిల్లుల చెల్లింపుల్లో పారదర్శకత పాటిస్తున్నారా? అనే అంశాలపై సమగ్ర వివరాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు.

స్టాండింగ్ కమిటీలు ఏర్పాటు చేయాలి

మున్సిపాలిటీలో కీలక నిర్ణయాలు, అభివృద్ధి పనులు, ఆర్థిక వ్యవహారాల పర్యవేక్షణకు స్టాండింగ్ కమిటీల ఏర్పాటు అవసరమని కౌన్సిల్ సభ్యులు పట్టుబట్టారు. కమిటీల ఏర్పాటు ద్వారా పనులపై పర్యవేక్షణ పెరుగుతుందని, పాలనలో పారదర్శకతకు అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు.

సమాధానాల కోసం పట్టణ ప్రజల ఎదురుచూపులు!

మున్సిపాలిటీలో జరుగుతున్న ఖర్చులు, డీజిల్ పెట్రోల్ కూపన్ల వ్యవహారం, ప్రైవేటు వ్యక్తుల ప్రమేయంపై సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు అధికారులు సమగ్ర వివరణ ఇవ్వాల్సిన అవసరం ఉంది. కౌన్సిలర్లు చేసిన ఆరోపణలపై వాస్తవాలు ఏమిటి? నిధుల వినియోగంలో నిబంధనలు పాటించారా? ప్రైవేటు వ్యక్తుల జోక్యానికి అధికారిక అనుమతి ఉందా? అన్న అంశాలపై సమగ్ర విచారణ జరిగితేనే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

ప్రజాధనంతో నడిచే మున్సిపాలిటీలో ప్రతి రూపాయికి లెక్క ఉండాలి. ప్రజాప్రతినిధులు అడిగే ప్రశ్నలకు అధికారులు సమాధానం చెప్పాలి. ఆరోపణలకు వివరణ ఇవ్వాలి. అంతిమంగా మధిర పట్టణ ప్రజలకు కావాల్సింది రాజకీయ ఆధిపత్య పోరు కాదు.. పారదర్శకమైన పాలన, జవాబుదారీతనం, అభివృద్ధి!

## సీఐఐ సదస్సులో లోకేష్ దూకుడు....
## జాతీయ మీడియాలో కథనాలు.,,, శుభాకాంక్షలు తెలియజేసిన




చేకూరి శేఖర్ బాబు (టిడిపి తెలంగాణ రాష్ట్ర శాఖ)

మధిర నవంబర్ 13(సికె న్యూస్)విశాఖ వేదికగా జరిగిన జ×× భాగస్వామ్య సదస్సులో ఏపీ మంత్రి నారా లోకేష్ స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచారు. సాధారణంగా జాతీయ మీడియా యాంకర్లు అడిగే ప్రశ్నలకు నేతలు తడబడటం చూస్తుంటాం. కానీ ఇక్కడ సీన్ రివర్స్ అయింది. రాష్ట్ర విద్యుత్ అవసరాలు, భవిష్యత్ ప్రణాళికలపై యాంకర్ అడిగిన ప్రశ్నలకు లోకేష్ ఎక్కడా తడబడకుండా, పక్కా గణాంకాలతో కూడిన ఆన్సర్స్ ఇవ్వడంతో జాతీయ మీడియా సైతం ఆశ్చర్యపోవాల్సి వచ్చింది. ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అనుకూలతలను, ప్రభుత్వ విధానాలను లోకేష్ వివరించిన తీరు చూస్తుంటే, ఏపీ ప్రగతిపై నేరుగా ప్రధాని మోదీకి, ఢిల్లీ పెద్దలకు సమగ్ర రిపోర్ట్ అందినట్లయిందనే చర్చ రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది.

ప్రతి అంశంపైనా పూర్తి క్లారిటీతో మాట్లాడిన లోకేష్, గడిచిన ఏడాది కాలంలోనే ఏపీలో కరెంటు వాడకం ఏకంగా 30 శాతం పెరిగిందని స్పష్టం చేశారు. భారీ పరిశ్రమలు, డేటా సెంటర్లు ఇంకా పూర్తిస్థాయిలో ఉత్పత్తి ప్రారంభించకముందే ఈ స్థాయిలో డిమాండ్ పెరిగిందంటే, 2028 నాటికి రాష్ట్ర విద్యుత్ అవసరాలు కనీసం రెట్టింపు అవుతాయని ఆయన అంచనా వేశారు. ఈ భారీ డిమాండ్‌ను తట్టుకోవడానికి బేస్‌లోడ్ పవర్ కోసం థర్మల్, గ్యాస్ వంటి సంప్రదాయ విద్యుత్ వనరులు తప్పనిసరి అని చెబుతూనే, మరోవైపు రాయలసీమలో పుష్కలంగా ఉన్న సోలార్, విండ్ ఎనర్జీతో పాటు పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేస్తామని ధీమా వ్యక్తం చేశారు.గత ప్రభుత్వ వైఫల్యాలను, ప్రస్తుత ప్రభుత్వం వేగాన్ని పోలుస్తూ లోకేష్ చెప్పిన లెక్కలు సదస్సులో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. 2019 నుంచి 2024 మధ్య ఐదేళ్ల కాలంలో సరైన పాలసీలు లేకపోవడం వల్ల ఏపీలో కేవలం 6 మెగావాట్ల గ్రీన్ ఎనర్జీ మాత్రమే అందుబాటులోకి వస్తే, తమ ప్రభుత్వం వచ్చిన ఒక్క ఏడాదిలోనే ఏకంగా 4.8 గిగావాట్ల విద్యుత్‌ను జత చేశామన్నారు. పగటిపూట సోలార్ కరెంటు 50 పైసలకే దొరికినా, రాత్రివేళల్లో యూనిట్ రూ.10 నుంచి రూ.30 వరకు వెళ్లే పరిస్థితి ఉందని, అందుకే 24 గంటల పాటు తక్కువ ధరకే గ్రీన్ ఎనర్జీని అందించేలా పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులను 5-7 ఏళ్లు కాకుండా, కేవలం రెండు మూడేళ్లలోనే పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వివరించారు.గత ఐదేళ్లలో పెండింగ్‌లో ఉన్న బకాయిలన్నీ క్లియర్ చేసి క్లీన్ స్లేట్‌తో ముందుకు వెళ్తున్నామని లోకేష్ పరిశ్రమలకు భరోసా ఇచ్చారు. మొత్తానికి, కేవలం మాటలతో కాకుండా కచ్చితమైన డేటా, భవిష్యత్ ప్రణాళికతో లోకేష్ ఇచ్చిన సమాధానాలు జాతీయ స్థాయి పారిశ్రామికవేత్తలను, మీడియాను కట్టిపడేశాయి. ఈ సదస్సు ద్వారా ఏపీలో జరుగుతున్న వేగవంతమైన మార్పులు నేరుగా కేంద్ర ప్రభుత్వ పెద్దల దృష్టికి వెళ్లడంతో, రాష్ట్రానికి రానున్న రోజుల్లో మరిన్ని భారీ ప్రాజెక్టులు, కేంద్ర సహకారం అందడం ఖాయమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

## మున్నూరు కాపు ఐక్యత వర్ధిల్లాలి
## - ఒకే తాటిపై నడుద్దాం!



మధిర నవంబర్ 13(సికె న్యూస్)మున్నూరు కాపు ఐక్యతకు వర్ధిల్లాలి అని నినాదంతో శుక్రవారం మార్కెట్ యార్డ్ నందు కార్తీకమాస వనసమారాధన కార్యక్రమంపై తీర్మాన సమావేశం జరిగింది.మాజీ మండల అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్, మార్కెట్ యార్డ్ చైర్మన్ బండారు నరసింహారావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మున్నూరు కాపు కుల పెద్దలు పాల్గొన్నారు.కుల బాంధవులందరూ కలిసి ఏకతాటిపై మనమంతా ఈ వన సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించాలని, మనమంతా ఐక్యతతో కూడి మన మున్నూరు కాపును నిలబెట్టాలని, కలిసికట్టుగా ఈ వన సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించాలని తీర్మానించారు.

ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు నియోజకవర్గ అధ్యక్షులు ఆళ్ళ కృష్ణ, ఎనిమిదో వార్డ్ కౌన్సిలర్ యన్నం కోటేశ్వరరావు, 19వ వార్డ్ కౌన్సిలర్ యన్నం శెట్టి అప్పారావు, 14వ వార్డ్ కౌన్సిలర్ శ్రీపాలిశెట్టి వెంకట్రావు, మాజీ కోసం సభ్యులు కొఠారి రాఘవ, భూసా కోటేశ్వరరావు, పసుపులేటి సత్యనారాయణ, ధనిశెట్టి శ్రీనివాసరావు, మున్నూరుకాపు పట్న అధ్యక్షులు దేవిశెట్టి కృష్ణ, మండల అధ్యక్షులు గంగిశెట్టి చిరంజీవి, జిల్లా ఉపాధ్యక్షులు పసుపులేటి నాగేంద్ర శ్రీనివాసరావు, శాఖమూడి రంగారావు, మిక్కినేని కృష్ణ, రామిశెట్టి నాగేశ్వరరావు, మందడపు వెంకటనారాయణ, జింకల కోటేశ్వరరావు,

, రావూరి కృష్ణ ప్రసాద్, జున్ను సుదర్శన్, సిధా కృష్ణ, రామిశెట్టి శ్రీనివాసరావు, లంకె మల్ల నాగేశ్వరరావు, వీరంశెట్టి సీతారామయ్య, గుర్రం సురేష్, మిరియాల సీతారామయ్య, సాయి యక్కటీల కృష్ణారావు, పాలెపు వెంకటేశ్వర్లు, చిన్నం వెంకటేశ్వర్లు, చెన్నం స్వామి తదితర నాయకులు పాల్గొన్నారు.జై మున్నూరు కాపు, జై జై మున్నూరు కాపు – ఐక్యతతో వర్ధిల్లాలి, ఒకే తాటిలో నడవాలి!

# నాగుల చవితి వేడుకలు,ఘనంగా,





కార్యక్రమం లో ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో హాజరై వేడుకలను విజయవంతం చేశారు

సీ కే న్యూస్ :చేగుంట / చేగుంట మండల కేంద్రంలో నాగుల చవితి సందర్భంగా చేగుంట పట్టణం లోని నాగులమ్మ దేవాలయంలో భక్తులు పెద్ద ఎత్తున హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ నిర్వకులు మాట్లాడుతూ నాగులమ్మ దేవాలయంలో సంతాన నాగ దేవతగా వెలిసిన అమ్మవారు ఇక్కడ వెలిసి అమ్మవారు అందరికీ సంతానాన్ని ప్రసాదిస్తుందని, పెళ్లి కాని వారికి పెళ్లిళ్లు జరుగుతున్నాయని, పిల్లలు లేని వారికి పిల్లలు కలుగుతారని నమ్మకంతో భక్తులు ఇక్కడికి వస్తారని అన్నారు . భక్తులు మొక్కులు తీర్చుకొని తమ కోరికలు నెరవేర్చుకుంటున్నారని, పట్టణం లో ఆలయం దినదినాభివృద్ధి చెందుతుందని . అమ్మవారు ఎంతో శ్రేష్ఠమైనదని, ఇష్టంతో ఎవరైతే పూజలు చేసుకుంటారో వారి కోరికలను తప్పకుండా నెరవేరుస్తుందని అన్నారు. ప్రతి సంవత్సరం వార్షికోత్సవం, నాగుల చవితి, నాగుల పంచమి వేడుకలను బ్రహ్మాండంగా జరుపుకుంటున్నామని తెలిపారు.

నాగుల చవితిని ఆంధ్ర ప్రజలు ఎక్కువగా జరుపుకుంటారని, తెలంగాణ ప్రజలు చాలా తక్కువగా జరుపుకుంటారని, నాగుల పంచమిని తెలంగాణ వారు ఎక్కువగా జరుపుకుంటారని తెలిపారు.ఈ

# 12 గంటల పాటు నిర్విరామంగా ఎమ్మెల్యే పర్యటన.. ఒకే రోజు 10 గ్రామాల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం

- పల్లెపల్లెకూ పరుగులు.. ప్రజల మధ్యే ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌లి
- ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవాలు, సీసీ రోడ్లు, డ్రైనేజీలు, భవనాలకు శంకుస్థాపనలు
- 119 మందికి చేయూత పింఛన్ల ప్రొసీడింగ్స్ పంపిణీ



**షాద్‌నగర్ నియోజకవర్గ కొత్తూర్ సి కె న్యూస్ ప్రతినిధి నవంబర్ 13 :** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఒకే రోజు 12 గంటల పాటు నిర్విరామంగా పర్యటించారు. శుక్రవారం ఉదయం 7 గంటలకు ప్రారంభమైన ఆయన పర్యటన సాయంత్రం 7 గంటల వరకు కొనసాగింది. ఒకే రోజు పది గ్రామాల్లో పర్యటిస్తూ పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ప్రతి గ్రామంలో ప్రజలు, కాంగ్రెస్ శ్రేణులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు.ఫరూఖ్‌నగర్ మండలం చించోడు గ్రామ పరిధిలోని గౌరికుంట తండాలో గిరిజన కుటుంబం నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటిని ఎమ్మెల్యే ప్రారంభించారు. లబ్ధిదారులకు వస్త్రాలు అందజేసి వారి ఆనందంలో భాగస్వాములయ్యారు. అనంతరం ఫరూఖ్‌నగర్‌లో నిర్వహించిన చేయూత పింఛన్ల గుర్తింపు పత్రాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు పత్రాలు అందజేశారు.కొత్తూరు మండలంలోని పెంజర్ల గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల గృహప్రవేశ వేడుకల్లో పాల్గొని నూతన గృహాలను ప్రారంభించారు. కొడిచర్లలో సీసీ రోడ్డు, డ్వాక్రా భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేయడంతో పాటు కొత్తగా మంజూరైన పింఛన్ల ప్రొసీడింగ్స్ అందజేశారు. కొడిచర్ల తండా, ఖాజిగూడ తండాల్లో డ్వాక్రా భవనాలను ప్రారంభించి సీసీ రోడ్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ నిర్వహించి గృహప్రవేశ కార్యక్రమంలోనూ పాల్గొన్నారు.ఎస్.బి. పల్లిలో మహిళా సమాఖ్య భవనం, గ్రామపంచాయతీ భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. హైమాస్ట్ లైట్లను ప్రారంభించి సీసీ రోడ్లు, భూగర్భ మురుగునీటి కాలువల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కొత్తగా మంజూరైన పింఛన్ల ప్రొసీడింగ్స్ అందజేశారు.సిద్ధాపూర్ గ్రామ పరిధిలోని చింతగట్టు తండాలో భూగర్భ మురుగునీటి కాలువలు, సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. సిద్ధాపూర్‌లో వాటర్ ఫిల్టర్ ప్లాంట్, ఎస్సీ కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించారు. గ్రామపంచాయతీ భవనం, సీసీ రోడ్డు నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు.

వై.ఎం. తండాలో గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసి వీధి దీపాలను ప్రారంభించారు. సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టడంతో పాటు ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇమ్మల్‌నర్వ గ్రామంలోని ఎస్సీ కాలనీలో అంబేద్కర్ భవనాన్ని ప్రారంభించారు.కొత్తూరు మున్సిపాలిటీ,పరిధిలోని,కుమ్మరిగూడలో మహిళా సమాఖ్య భవన నిర్మాణానికి, నాలుగో వార్డులో పోలీస్ స్టేషన్ సమీపంలోని పార్కు అభివృద్ధి పనులకు రూ.85 లక్షలతో శ్రీకారం చుట్టారు. అదేవిధంగా రెండు ట్రాక్టర్లను పంపిణీ చేశారు. మొత్తం 119 మంది లబ్ధిదారులకు చేయూత పింఛన్ల ప్రొసీడింగ్స్ అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ.ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నిరుపేదల సొంతింటి కలను సాకారం చేస్తున్నామని తెలిపారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, భూగర్భ మురుగునీటి కాలువలు, మహిళాసమాఖ్య,భవనాలు,గ్రామపంచాయతీ భవనాలు నిర్మిస్తూప్రజలకు,మెరుగైనమౌలికసదుపాయాలు కల్పిస్తున్నామని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడంతో పాటు షాద్‌నగర్ నియోజకవర్గంలోని గ్రామాల సమగ్ర అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని స్పష్టంచేశారు.ఈ,పర్యటనలో కొత్తూరు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శేఖర్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు సుదర్శన్ గౌడ్, ఫరూఖ్‌నగర్ మండల అధ్యక్షుడు రాయికల్ శ్రీనివాస్,పీఏసీఎస్ చైర్మన్లు అంబటి ప్రభాకర్, శ్రీకాంత్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలరాజు గౌడ్, తుపాకుల శేఖర్, రఘు నాయక్, వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.12 గంటల పాటు ప్రజల మధ్య గడుపుతూ పల్లెల అభివృద్ధికి ప్రాధాన్యతనిచ్చిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పర్యటన నియోజకవర్గంలో,ప్రత్యేక,చర్చనీయాంశంగా మారింది.

# పెంజర్లలో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

- ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ జెడ్పిటిసి శ్యాంసుందర్ రెడ్డి
- ఒంటరి మహిళలకు పింఛన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే
- పెంజర్ల సర్పంచ్ ఎర్రోళ్ల జగన్ ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇల్లు ప్రారంభోత్సవం



**షాద్ నగర్ నియోజకవర్గ కొత్తూర్ సి కె న్యూస్ ప్రతినిధి నవంబర్ 13 :** రంగారెడ్డి జిల్లా షాద్నగర్ నియోజకవర్గం కొత్తూరు మండలం పరిధిలోని పెంజర్ల గ్రామంలో ఇందిరమ్మ పథకం కింద నిర్మించిన ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా,నూతన,గృహ,యజమానులకు శుభాకాంక్షలు తెలిపి, వారి కుటుంబం సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు సర్పంచ్ జగన్ ఉప సర్పంచ్ వాడు మెంబర్లు కొత్తూరు మండల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎల్లారం శేఖర్ రెడ్డి కాంగ్రెస్ కార్యకర్తలు మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు,అనంతరం గ్రామంలోని ఒంటరి మహిళలకు పింఛన్లు పంపిణీ చేశారు. అర్హులైన పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో చికిత్స పొందుతున్న ప్రేమ కుమార్ ను పరామర్శించిన ప్రొద్దుటూరు మాజీ సర్పంచ్ మరియు నాయకులు



**సి.కె , న్యూస్, చింతకాని ప్రతినిధి** ఒక పేద కుటుంబంలో జన్మించి ఒక ఆనాదగా జీవనం సాగిస్తూ అందరితో కలివిడిగా ఉంటూ అకస్మాత్తుగా అనారోగ్యానికి గురై వరంగల్ ఎంజీఎం హాస్పిటల్లో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన గొర్రె ముచ్చు ప్రేమ్ కుమార్ ని హాస్పటల్లో పరామర్శించి అతని ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని నీకు నేనున్నాను నీకేమీ కాదు అంటూ భరోసా కల్పించి డాక్టర్లను సంప్రదించి ప్రేమ్ కుమార్ కి మెరుగైన వైద్యం అందించాలని కోరిన ప్రొద్దుటూరు గ్రామ మాజీ సర్పంచ్ పెంట్యాల పుల్లయ్య స్వామి పరామర్శించిన వారిలో ఉలి విశ్వనాథం స్వామి, గ్రామ వార్డు నెంబర్ గొర్రె ముచ్చు జాను గొర్రె ముచ్చు కరుణాకర్ , పెంట్యాల నరసింహారావు స్వామి, చల్లా నవీన్ , గొర్రె ముచ్చు ప్రేమ్ కుమార్ త్వరగా కోలుకొని మంచి ఆరోగ్యంతో మనందరి మధ్యలో కలివిడిగా ఉండాలని మనమందరం కోరుకుందామని నాయకులు తెలియజేశారు.

# ప్రభుత్వ భూముల పరిరక్షణకు రెవెన్యూ శాఖ స్పెషల్ డ్రైవ్



- అమీన్‌పూర్‌లో వరుసగా రెండో రోజు కూల్చివేతలు..
- అక్రమ నిర్మాణాలపై అధికారుల కొరడా
- ఐలాపూర్ తండా, విలేజ్‌లో జేసీబీలతో బేస్‌మెంట్ల తొలగింపు..
- సర్వే నంబర్ 1112లో భూమి స్వాధీనం

**అమీన్‌పూర్, నవంబర్ 13 (సీ కే న్యూస్ ప్రతినిధి):** అమీన్‌పూర్ ప్రాంతంలో ప్రభుత్వ భూముల ఆక్రమణల తొలగింపు ప్రక్రియ వేగం పుంజుకుంది. ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసి చేపడుతున్న నిర్మాణాలపై రెవెన్యూ అధికారులు వరుసగా చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం రెండో రోజు కూడా కూల్చివేతల కార్యక్రమాన్ని కొనసాగించారు. ఐలాపూర్ తండా, ఐలాపూర్ విలేజ్ పరిధిలో అక్రమంగా నిర్మించిన బేస్‌మెంట్లను జేసీబీలతో తొలగించారు.

అదేవిధంగా అమీన్‌పూర్ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 1112లో ప్రభుత్వ భూమిని ఆక్రమించి నిర్మించిన కట్టడాలను తొలగించి, సంబంధిత స్థలాన్ని తిరిగి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకున్నారు.మూడు సర్వే నంబర్ల నుంచి మరో ప్రాంతానికి విస్తరించిన చర్యలు

గురువారం సర్వే నంబర్లు 991, 630, 1042లో ఆక్రమణల తొలగింపు చేపట్టిన రెవెన్యూ అధికారులు, తాజాగా మరో ప్రాంతంలోనూ చర్యలు చేపట్టడం స్థానికంగా చర్చనీయాంశమైంది. ప్రభుత్వ భూముల వివరాలను పరిశీలిస్తూ ఆక్రమణలను గుర్తించి దశలవారీగా తొలగిస్తున్నట్లు అధికారుల చర్యలను బట్టి తెలుస్తోంది.కూల్చివేతలతో పాటు భూముల రక్షణపై దృష్టి పెట్టాలిపోలీసు బందోబస్తు మధ్య రెవెన్యూ అధికారులు కూల్చివేతలను పూర్తి చేశారు. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు. అయితే, ఆక్రమణలను తొలగించిన భూములు తిరిగి కబ్జాలకు గురికాకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. స్వాధీనం చేసుకున్న స్థలాలకు హద్దులు ఏర్పాటు చేసి ఫెన్సింగ్ వేయడంతో పాటు ప్రభుత్వ భూముల వివరాలను బహిరంగంగా ప్రదర్శించాలని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

# పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

**నాగులవంచలో 151 మందికి పింఛన్లు మంజూరు.. లబ్ధిదారుల్లో ఆనందోత్సవాలు**




**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.**చింతకాని మండలం నాగులవంచ గ్రామంలో ఎన్నో ఏళ్లుగా పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న పేదలకు ప్రజా ప్రభుత్వం శుభవార్త అందించింది. గ్రామానికి చెందిన 151 మంది అర్హులైన లబ్ధిదారులకు పింఛన్లు మంజూరు కావడంతో గ్రామంలో ఆనందోత్సవ వాతావరణం నెలకొంది.

వృద్ధాప్య, గీత కార్మిక, వితంతు తదితర పింఛన్లు మంజూరు కావడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. పేదల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని పింఛన్లు మంజూరు చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కి, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, విద్యుత్, ప్రణాళిక శాఖల మంత్రి, మధిర నియోజకవర్గ శాసనసభ్యులు మల్లు భట్టి విక్రమార్క కి నాగులవంచ గ్రామ సర్పంచ్ నారగాని రాంబాయి--శ్రీనివాసరావు దంపతులు, గ్రామ ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పేదల ఎన్నో ఏళ్ల ఎదురుచూపులకు తెరదించి, అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తున్న ప్రజా ప్రభుత్వానికి నాగులవంచ గ్రామ ప్రజలు ధన్యవాదాలు తెలిపారు. పింఛన్లు మంజూరు కావడం పట్ల లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కులకు కృతజ్ఞతలు తెలిపారు.

# వైద్య ఖర్చుల భారం తగ్గించేందుకు జతిన్ ఆస్పత్రిలో క్యాష్‌లెస్ సేవలు

- 32 ఆరోగ్య బీమా సంస్థలు, టీపీఏలతో ఒప్పందం..
- బీమా పాలసీదారులకు నగదు రహిత వైద్య చికిత్స -డాక్టర్ ఎం. వెంకటరమణ


**హిందూపురం, నవంబర్ 13 (సీ కే న్యూస్ ప్రతినిధి):**

:అనారోగ్య సమస్యలు ఎదురైనప్పుడు వైద్య ఖర్చుల కోసం ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న సామాన్య, మధ్యతరగతి ప్రజలకు అండగా నిలిచేందుకు హిందూపురంలోని జతిన్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి మరో కీలక ముందడుగు వేసింది. ఆస్పత్రిలో ఆరోగ్య బీమా కలిగిన వారికి నగదు రహిత వైద్య చికిత్స (క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్) సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ఆస్పత్రి వైద్యులు డాక్టర్ ఎం. వెంకటరమణ నాయక్ వెల్లడించారు. ప్రస్తుతం రోజురోజుకూ వైద్య చికిత్సల ఖర్చులు పెరుగుతున్నాయని, ముఖ్యంగా అత్యవసర వైద్య పరిస్థితులు ఎదురైనప్పుడు కుటుంబ సభ్యులు చికిత్స కోసం పెద్ద మొత్తంలో డబ్బులు సమకూర్చుకోవాల్సిన పరిస్థితి ఉంటోందన్నారు. ఆరోగ్య బీమా పాలసీలు ఉన్నప్పటికీ, నగదు చెల్లించి చికిత్స పొందిన తర్వాత బీమా మొత్తాన్ని తిరిగి పొందే ప్రక్రియలో కొంత సమయం, ఇబ్బందులు ఎదురవు తున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో రోగులకు మరింత సౌకర్యవంతంగా వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో తమ ఆస్పత్రిలో క్యాష్‌లెస్ వైద్య సదుపాయాన్ని ప్రారంభించినట్లు వివరించారు. ఈ సదుపాయం కోసం దేశంలోని ప్రముఖ ఆరోగ్య బీమా సంస్థలు, థర్డ్ పార్టీ అడ్మినిస్ట్రేటర్లతో (టీపీఏ) కలిపి మొత్తం 32 సంస్థలతో ఆస్పత్రి అనుసంధానం చేసుకున్నట్లు తెలిపారు. హెచ్‌డీఎఫ్‌సీ ఎర్గో, స్టార్ హెల్త్, యునైటెడ్ హెల్త్‌కేర్, ఎల్ఐసీ, బజాజ్ అలియాంజ్, న్యూ ఇండియా అస్యూరెన్స్, ఓరియంటల్ ఇన్సూరెన్స్, ఐసీఐసీఐ లాంబార్డ్, రిలయన్స్ జనరల్ ఇన్సూరెన్స్, చోళ ఎంఎస్, డిజిట్, టాటా ఏఐజీ, లిబర్టీ జనరల్ ఇన్సూరెన్స్, రాయల్ సుందరం, యూనివర్సల్ సోంపో, మాగ్మా హెచ్‌డీఐ, భారతి ఏఎక్స్ఏ, ఎడెల్‌వైస్, శ్రీరామ్ జనరల్ ఇన్సూరెన్స్, కోటక్ జనరల్ ఇన్సూరెన్స్, ఫ్యూచర్ జనరలి, అకో, మణిపాల్‌సిగ్నా, కేర్ హెల్త్ ఇన్సూరెన్స్, అపోలో మ్యూనిక్, రిలిగేర్ తదితర సంస్థలతో పాటు పలు టీపీఏల సేవలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. క్యాష్‌లెస్ వైద్య విధానం ద్వారా అర్హత కలిగిన బీమా పాలసీదారులు చికిత్స పొందే సమయంలో ఆస్పత్రి, సంబంధిత బీమా సంస్థ లేదా టీపీఏ మధ్య అనుమతుల ప్రక్రియ పూర్తయిన అనంతరం పాలసీ పరిధిలోకి వచ్చే అర్హమైన వైద్య ఖర్చులను నేరుగా బీమా సంస్థ భరించే అవకాశం ఉంటుందని వివరించారు. దీనివల్ల రోగులు చికిత్స సమయంలో నగదు సమకూర్చుకోవడానికి పడే ఇబ్బందులు తగ్గుతాయని తెలిపారు. అయితే ప్రతి పాలసీకి సంబంధించిన నిబంధనలు, బీమా పరిమితి, వెయిటింగ్ పీరియడ్, మినహాయింపులు, చికిత్సకు ముందస్తు అనుమతి వంటి అంశాల ఆధారంగా నగదు రహిత సదుపాయం వర్తిస్తుందని స్పష్టం చేశారు. హిందూపురం పట్టణంతో పాటు పరిసర గ్రామీణ ప్రాంతాల ప్రజలు వైద్య అవసరాల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా స్థానికంగానే మెరుగైన వైద్య సేవలు పొందేందుకు తమ వంతు ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. ఆరోగ్య బీమా ప్రాధాన్యతను ప్రతి ఒక్కరూ గుర్తించి తగిన బీమా పాలసీ కలిగి ఉండాలని సూచించారు. ముఖ్యంగా కుటుంబంలో ఒకరికి అనారోగ్య సమస్య ఎదురైనప్పుడు మొత్తం కుటుంబ ఆర్థిక పరిస్థితిపై



భారం పడకుండా ఆరోగ్య బీమా రక్షణగా నిలుస్తుందని వివరించారు. జతిన్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో జనరల్ ఫిజీషియన్‌గా తాను వైద్య సేవలు అందిస్తున్నానని, రోగులకు నాణ్యమైన వైద్యం అందించడంతో పాటు వారికి అందుబాటులో ఉన్న బీమా సదుపాయాలను సద్వినియోగం చేసుకునేలా సహకరిస్తామని డాక్టర్ వెంకటరమణ నాయక్ తెలిపారు. క్యాష్‌లెస్ వైద్య సేవలకు సంబంధించి మరిన్ని వివరాలు, ఏయే పాలసీలకు ఏయే చికిత్సలు వర్తిస్తాయి, అవసరమైన పత్రాలు, అనుమతుల ప్రక్రియ తదితర వివరాల కోసం ఆస్పత్రిని నేరుగా సంప్రదించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# స్కేరీ పిక్చర్' ఫస్ట్ లుక్ వచ్చేసింది!




టాలీవుడ్‌లో తనదైన కామెడీ, థ్రిల్లర్ మేకింగ్‌తో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు రవిబాబు ఇప్పుడు బాలీవుడ్‌లో అడుగు పెడుతున్నారు. 'అల్లరి', 'నచ్చావులే' వంటి ఎంటర్‌టైనర్స్‌తో పాటు 'అనసూయ', 'అవును', 'అమరావతి' వంటి థ్రిల్లర్లతో తన ప్రత్యేకతను చాటుకున్న ఆయన.. తాజాగా ఓ డిఫరెంట్ హారర్ ప్రాజెక్ట్‌ను పట్టాలెక్కిస్తున్నారు. బాలీవుడ్ స్టార్ కంగనా రనౌత్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ సినిమాకు 'స్కేరీ పిక్చర్' అనే ఆసక్తికరమైన టైటిల్ ఖరారు చేశారు. సురేష్ ప్రొడక్షన్స్ అధినేత డి. సురేష్ బాబు నిర్మాణంలో, రానా దగ్గుబాటి ఈ ప్రాజెక్ట్‌ను ముందుకు తీసుకెళ్తున్నారు. తాజాగా రానా ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను విడుదల చేస్తూ ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచారు. ఇది రవిబాబుకు తొలి హిందీ ఫీచర్ ఫిల్మ్ కావడం మరో విశేషం. 'ఏనీటైం 2027' అంటూ విడుదల సమయాన్ని ప్రకటించారు. మరి తనదైన ప్రయోగాత్మక శైలికి కంగనా నటన తోడైతే ఈ హారర్ ప్రపంచం ఎలా ఉండబోతుందో చూడాలి!

# 'విశ్వంభర' నుంచి మరో సర్‌ప్రైజ్ అట..



మెగాస్టార్ చిరంజీవి ప్రధాన పాత్రలో, దర్శకుడు వశిష్ఠ తెరకెక్కించిన భారీ సోషియో ఫాంటసీ చిత్రం 'విశ్వంభర' కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. భారీ విజువల్స్, ఫాంటసీ ప్రపంచం, అద్భుతమైన గ్రాఫిక్స్‌తో రూపొందుతున్న సినిమాపై మొదటి నుంచే భారీ అంచనాలున్నాయి.


అయితే సినిమా విడుదల విషయంలో నెలకొన్న జాప్యం అభిమానుల ఎదురుచూపులను మరింత పెంచుతోంది. గతంలో మేకర్స్ కొన్ని ప్రమోషనల్ కంటెంట్‌ను విడుదల చేసినప్పటికీ, ఆ తర్వాత ప్రచార కార్యక్రమాలు కొంత నెమ్మదించాయి. తాజాగా సినిమా డబ్బింగ్ పనులు కూడా ముందుకు సాగుతుండటంతో పాటు, మరో కొత్త ప్రమోషనల్ కంటెంట్‌ను సిద్ధం చేస్తున్నారనే ప్రచారం వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో త్వరలోనే సినిమా నుంచి మరో ప్రోమో లేదా ట్రైలర్ తరహా కంటెంట్ వచ్చే అవకాశం ఉందని టాక్. అయితే ఈ అప్‌డేట్‌తోనే సినిమా విడుదల తేదీపై స్పష్టత వస్తుందా అన్నది ఆసక్తికరంగా మారింది.

మరోవైపు జనవరి మొదటి వారంలో 'విశ్వంభర' థియేటర్లలోకి రావచ్చనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. కానీ దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. కీరవాణి, గౌర హరి సంగీతం అందిస్తున్న చిత్రాన్ని యూవీ క్రియేషన్స్ నిర్మిస్తోంది. మరి మెగాస్టార్ అభిమానుల ఎదురుచూపులకు మేకర్స్ ఎప్పుడు తెరదించుతారో చూడాలి!

# సో స్టార్!




# ఓటీటీకి వచ్చేసిన విజయ్ రష్మిక జోడీ




టాలీవుడ్ సెన్సేషనల్ స్టార్ విజయ్ దేవరకొండ, రష్మిక మందన్నా జంటగా నటించిన భారీ పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'రణబాలి' ఎట్టకేలకు ఓటీటీ ప్రేక్షకుల ముందుకు వచ్చేసింది. దర్శకుడు రాహుల్ సంకృత్యాన్ తెరకెక్కించిన ఈ చిత్రం భారతీయ చరిత్రలోని కొన్ని విషాదకర ఘట్టాల నేపథ్యంలో రణబాలి అనే కల్పిత పాత్రను కేంద్రంగా చేసుకుని రూపొందింది. భారీ అంచనాలతో థియేటర్లలో విడుదలైన సినిమా బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో ప్రభావం చూపలేకపోయింది. అయితే కథాంశం, చారిత్రక నేపథ్యం, విజయ్ దేవరకొండ నటనపై ప్రేక్షకుల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. థియేటర్లలో సినిమాను మిస్ అయినవారికి ఇప్పుడు మరో అవకాశం దక్కింది. తాజాగా ఈ చిత్రం ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్‌కు వచ్చేసింది. తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో అందుబాటులోకి వచ్చింది. దీంతో మరింత విస్తృతమైన ప్రేక్షకులకు ఈ సినిమా చేరువ కానుంది. మైత్రి మూవీ మేకర్స్ నిర్మించిన ఈ చిత్రానికి అజయ్-అతుల్ సంగీతం అందించారు. మరి థియేటర్లలో మిశ్రమ స్పందన అందుకున్న 'రణబాలి'కి ఓటీటీలో ఎలాంటి ఆదరణ లభిస్తుందో చూడాలి!

# రష్మిక 'మైసా'కు రిలీజ్ డేట్ షాక్



టాలీవుడ్‌లో విడుదల తేదీల మార్పుల పర్వం కొనసాగుతోంది. ఇప్పటికే పలు భారీ చిత్రాలు వాయిదా బాట పట్టగా, తాజాగా నేషనల్ క్రష్ రష్మిక మందన్న నటిస్తున్న లేడీ ఓరియెంటెడ్ యాక్షన్ థ్రిల్లర్ 'మైసా' కూడా ఈ జాబితాలో చేరబోతున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఈ సినిమాలో రష్మిక తొలిసారిగా మైసా అనే గిరిజన యువతి పాత్రలో కనిపించనున్నారు. తన జాతికి జరిగిన అన్యాయంపై పోరాటం చేసే పవర్‌ఫుల్ పాత్ర కోసం ఆమె ప్రత్యేకంగా మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ తీసుకున్నారు. ఇటీవల విడుదలైన టీజర్‌లో ఆమె చేసిన రిస్కీ యాక్షన్ సన్నివేశాలు సినిమాపై అంచనాలను పెంచాయి. దర్శకుడు రవీంద్ర పుల్లే తెరకెక్కిస్తున్న చిత్రాన్ని తొలుత నవంబర్ 27న విడుదల చేయాలని మేకర్స్ భావించారు. అయితే పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో జాప్యం కారణంగా డిసెంబర్ 4కు వాయిదా వేయాలని యోచిస్తున్నట్లు ఫిలిం నగర్ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. రావు రమేష్, సముద్రఖని, గురు సోమసుందరం, ఈశ్వరీ రావు తదితరులు కీలక పాత్రల్లో నటిస్తుండగా, జేక్స్ బిజోయ్ సంగీతం అందిస్తున్నారు. మరి రష్మిక కెరీర్‌లో ప్రత్యేక చిత్రంగా భావిస్తున్న 'మైసా' అనుకున్న సమయానికి వస్తుందా? లేక మరో వారం ఆలస్యంగా పలకరిస్తుందా? అనేది ఆసక్తికరంగా మారింది!

# హీరోయిన్‌గా కాదు.. నిర్మాతగా..



నందమూరి నటసింహం బాలకృష్ణ కుమార్తె తేజస్విని సినీ రంగ ప్రవేశంపై కొంతకాలంగా ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది. ఇటీవల ఆమె డ్యాన్స్ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో హీరోయిన్‌గా వెండితెరకు పరిచయం కాబోతున్నారనే ఊహాగానాలు ఊపందుకున్నాయి. అయితే అందరి అంచనాలను తలకిందులు చేస్తూ తేజస్విని నిర్మాతగా తన కొత్త ప్రయాణాన్ని ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. తన క్లాస్‌మేట్ భుపన్ దర్శకత్వంలో ఓ విభిన్నమైన కాన్సెప్ట్‌తో సినిమాను నిర్మించేందుకు ఆమె ముందుకొచ్చినట్లు తెలుస్తోంది. ఈ చిత్రంలో నిర్మాత, దర్శకుడు సింధూరపువ్వు కృష్ణారెడ్డి తనయుడు అన్వేష్ హీరోగా నటించనుండగా, తమిళ నటుడు బాబీ సింహా కీలక పాత్రలో కనిపించనున్నారని టాక్. ఇప్పటికే ప్రీ ప్రొడక్షన్ పనులు పూర్తిచేసుకున్న సినిమా షూటింగ్ నవంబర్ 23న విశాఖపట్నంలోని గీతం ఇంజినీరింగ్ కాలేజీలో ప్రారంభం కానున్నట్లు సమాచారం. మొత్తానికి బాలయ్య కుమార్తె నటిగా కాకుండా నిర్మాతగా ఎంట్రీ ఇస్తున్నారనే వార్త నందమూరి అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. మరి తొలి ప్రయత్నంలోనే తేజస్విని ఎలాంటి కథతో ప్రేక్షకులను పలకరిస్తారో చూడాలి!

# 'రఘుకుల తిలక'పై కిరణ్ అబ్బవరం క్లారిటీ!

యంగ్ హీరో కిరణ్ అబ్బవరం తన తాజా చిత్రం 'రియాలిటీ'తో ప్రేక్షకులను పలకరించేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే ఈ సినిమా పోస్టర్లు, పాటలు ఆసక్తిని పెంచుతుండగా.. తాజాగా ఇందులో ఉండబోతున్న ఓ ప్రత్యేక ఆధ్యాత్మిక గీతంపై కిరణ్ ఆసక్తికరమైన విషయాలు వెల్లడించారు. 'రియాలిటీ'లో 'రఘుకుల తిలక' పాట ఉంటుందంటూ కొంతకాలంగా ప్రచారం జరుగుతోంది. తాజాగా 'రుత్తూ' పాట విడుదల కార్యక్రమంలో పాల్గొన్న కిరణ్ అబ్బవరం ఈ వార్తలను ధృవీకరించారు. తాను ఆంజనేయ స్వామికి వీరాభిమానినని, 'రఘుకుల తిలక' గీతం తన మనసుకు ఎంతో దగ్గరైన పాటని తెలిపారు. అందుకే తనకు ఎంతో ఇష్టమైన ఈ గీతాన్ని సినిమాలో ప్రత్యేకంగా పొందుపరచాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. అంతేకాదు, ఒరిజినల్ కంపోజర్లు, గాయకులతోనే ఈ పాటను మళ్లీ పాడించినట్లు వెల్లడించారు. ఇక ఇప్పటికే మంచి స్పందన అందుకున్న 'భజే గోవిందం' పాట వెనుక కూడా ఓ ఆసక్తికరమైన కథ ఉందట. తాను నిర్మించిన 'తిమ్మరాజుపల్లి' చిత్రానికి పనిచేసిన ఓ కొత్త రచయిత ప్రతిభ నచ్చడంతో అతడికి ఈ పాట రాసే అవకాశం ఇచ్చినట్లు కిరణ్ తెలిపారు. సంగీత దర్శకుడు బీమ్స్ సిసిరోలియో కూడా ఈ నిర్ణయాన్ని ప్రోత్సహించారన్నారు. కాగా, 'రియాలిటీ' చిత్రాన్ని డిసెంబర్ 25న క్రిస్మస్ కానుకగా విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. మరి ఆధ్యాత్మిక గీతాలతో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్న ఈ సినిమా ప్రేక్షకులను ఏ మేరకు మెప్పిస్తుందో చూడాలి!

